రిపోర్టర్లు కావలెను
అధునాతన సాంకేతికతతో..
ఎప్పటి వార్తలు అప్పుడు అందించేందేందుకు
మీ ముందుకు వచ్చిన
ప్రజా టెలివిజన్
యూట్యూబ్ చానల్‌లో పని చేయుటకు
రిపోర్టర్లు కావలెను. ఎలాంటి టార్గెట్లు ఉండవు.
నిత్యనూతనంగా వార్తలు, లైవ్‌లు అందించడమే మీ పని..
సంప్రదించండి: 8309979541, 9494659622
ప్రజా TV PRAJA TELEVISION The People's Favour
మా యూట్యూబ్ చానల్‌ను సపోర్ట్ చేయండి
8309979541
ప్రజా టెలివిజన్
తాజా వార్తలు, అప్‌డేట్,
లైవ్ ప్రోగ్రామ్‌ల కోసం లైక్, షేర్, సబ్‌స్క్రైబ్

Bhavani Publication Trust https://prajatheerpudaily.com
APTEL/2001/5268

# ప్రజాతీర్పు

The people's Verdict

తెలుగు జాతీయ దినపత్రిక

సంపుటి : 24 | సంచిక : 364 | హైదరాబాద్ | బుధవారం 18 డిసెంబర్ 2024 | పేజీలు : 8 | వెల : రూ. 1/-

Cerculated From : KARIMNGAR, HYDERABAD, WARAGAL, RANGAREDDY, MAHABOOBNAGAR, THIRUPATI, GUNTUR, KURNOOL, ANATAPUR, VISAKAPATNAM, CHENNAI, BANGALOOOR



## కేటీఆర్‌పై విచారణకు రంగం సిద్ధం

**హైదరాబాద్**

ఫార్ములా వన్ (ఈ కార్) రేసుకు సంబంధించి మాజీ మంత్రి, బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను విచారించేందుకు రంగం సిద్ధమైంది. ఇందుకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అనుమతి చ్చారు. ఈ క్రమంలో సోమ వారం నాటి రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో చర్చించిన ప్రకారం గవర్నర్ అనుమతించిన విషయాన్ని పేర్కొంటూ సదరు లేఖను ఏసీబీకి పంపాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో కేటీఆర్‌ను విచారించేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి గవర్నర్ అనుమతి లేఖ'ను మంగళవారం రాత్రి 10.30 గంటల సమయంలో ఏసీబీకి పంపారు. సోమవారం నిర్వహించిన క్యాబినెట్‌లో ఫార్ములా–ఈ కార్ రేసు వ్యవహారంపైన, విద్యుత్తు వ్యవహారాలకు సంబంధించి జస్టిస్ మదన్ లోకూర్ ఇచ్చిన నివేదికపైనా సమగ్రంగా చర్చించారు. ఫార్ములా రేసు పూర్వాపరాలు, అనుమతి లేకుండానే హెచ్ఎండీఏ ఒప్పందం చేసుకోవడం,

- మిగతా 2వ పేజీలో



# జేపీసీకి జమిలి బిల్లులు!

### లోక్‌సభలో రెండు బిల్లులను ప్రవేశపెట్టిన కేంద్ర మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్

- తీవ్రంగా వ్యతిరేకించిన విపక్షాలు.. డివిజన్ ఓటింగ్
- మొదటి అడుగులోనే లభించని 2/3 ఆధిక్యం!
- టీడీపీ, శివసేన శిందే వర్గం సంపూర్ణ మద్దతు
- రాజ్యాంగానికి, సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధం: విపక్షాలు

**జమిలికి మద్దతు 269 మంది**

**జమిలికి వ్యతిరేకం 198 మంది**

**న్యూఢిల్లీ**

లోక్‌సభ, రాష్ట్రాల శాసనసభలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించే ఉద్దేశంతో మోదీ సర్కారు చేపట్టిన 'ఒకే దేశం– ఒకే ఎన్నిక'కు సంబంధించి చట్టపరమైన ప్రక్రియ ఎట్టకేలకు మొదలైంది! ఈ అంశంపై అధికార, విపక్షాల మధ్య వాడివేడి చర్చ, బిల్లులను ప్రవేశపెట్టే తీర్మానంపై ఓటింగ్ అనంతరం.. జమిలి ఎన్నికలకు సంబంధించి అత్యంత కీలకమైన రెండు బిల్లులను కేంద్ర న్యాయ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ మంగళవారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ఆ బిల్లుల్లో ఒకటి.. 129వ రాజ్యాంగ సవరణ బిల్లు, 2024 కాగా, రెండోది కేంద్ర పాలిత ప్రాంతాల చట్ట సవరణ బిల్లు,

- మిగతా 2వ పేజీలో



VS

## అప్పులకుప్పపై సభలో అధికార ప్రతిపక్షాల వాగ్యుద్ధం

- ఏడాదిలో రూ.1.27 లక్షల కోట్ల అప్పేంటి?
- ఇలాగైతే ఐదేండ్లలో 6.37 లక్షల కోట్లకు అప్పు : హరీశ్‌రావు
- ప్రతిపైసాకూ జవాబుదారీతనంగా ఉంటాం.. మీ మాదిరిగా లెక్కలు దాచం
- కావాలంటే ప్రత్యేకంగా దీనిపైనే చర్చించేందుకు మేం రెడీ : డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**హైదరాబాద్**

శాసనసభలో మంగళవారం ప్రశ్నోత్తరాల సమయంలో ఎఫ్ఆర్‌బీఎమ్ రుణాలపై వాడీవేడిగా చర్చ నడిచింది. అప్పులకు కారణం మీరంటే..మీరే కారణమంటూ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, బీఆర్ఎస్ సభ్యులు హరీశ్‌రావుల మధ్య సవాళ్లు,

- మిగతా 2వ పేజీలో



## ప్రతి డాక్టర్ సేవకే ప్రాధాన్యత ఇవ్వాలి

### రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

**అమరావతి:** ప్రతి డాక్టర్ సేవకే ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము యువ వైద్యులకు పిలుపునిచ్చారు. యువ వైద్యులుగా అత్యుత్తమ సేవలందించాలని సూచించారు. మంగళగిరి ఎయిమ్స్ మొదటి స్నాతకోత్సవం సందర్భంగా ఎంబీబీఎస్ విద్యార్థులకు పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రతి రోగికి వైద్య సేవలు అందించాలని, ఆయుష్మాన్ భారత్ ద్వారా

- మిగతా 2వ పేజీలో



## కాంగ్రెస్‌ను దించేందుకు ఉపాయం ఉందా అని ప్రజలు అడుగుతున్నారు : కేటీఆర్

లగచర్ల రైతులనే కాదు.. సోషల్‌మీడియాలో పోస్టులు పెట్టిన వారిని కూడా అరెస్టు చేస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు. సోషల్‌మీడియాలో పోస్టులు పెడితే పీడీ యాక్ట్ పెడతామని బెదిరిస్తున్నారని అన్నారు. కొడంగల్ రైతులు కూడా రేవంత్ రెడ్డికి ఓటేశామని బాధపడుతున్నారని కేటీఆర్ అన్నారు. పట్నం నరేందర్ రెడ్డి, లగచర్ల రైతులను అరెస్టు చేసి 35 రోజులైందని తెలిపారు. నాంపల్లి కోర్టులో లగచర్ల రైతులు, పట్నం నరేందర్ రెడ్డి కేసులపై వాదనలు ముగిశాయని చెప్పారు. మనకు అనుకూలంగా తీర్పు రాకుంటే హైకోర్టు, సుప్రీంకోర్టుకు కూడా వెళదామని స్పష్టం చేశారు. లగచర్ల రైతులకు న్యాయం జరిగేవరకు సర్కార్‌ను వదిలిపెట్టమని హెచ్చరించారు. కొడంగల్‌లో రేవంత్ రెడిని తుకుతుకుగా ఓడించే సత్తా పట్నం నరేందర్ రెడ్డికి

- మిగతా 2వ పేజీలో



## మహాకుంభ మేళలో శ్రీవారి నమూనా ఆలయానికి విస్తృత ఏర్పాట్లు : టీటీడీ

**తిరుపతి :** ఉత్తరప్రదేశ్ లోని ప్రయాగ్ రాజ్ (అలహాబాద్)లో జనవరి 13 నుంచి ఫిబ్రవరి 26 వరకు జరుగనున్న మహాకుంభ మేళలో టీటీడీ ఆధ్వర్యంలో శ్రీవారి నమూనా ఆలయం ఏర్పాటుకు విస్తృత ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా మంగళవారం టీటీడీ జేఈవో గౌతమి సంబంధిత అధికారులతో నిర్వహించిన సమీక్షలో పలు సూచనలు చేశారు. శ్రీవారి ఆలయం ఏర్పాటు వల్ల ఉత్తరాది భక్తులు స్వామివారి వైభవాన్ని సంతృప్తిగా తిలకించేలా పటిష్ట ఏర్పాట్లు చేపట్టాలని కోరారు. 45 రోజుల పాటు సాగే మహాకుంభ మేళకు దాదాపు 2.50 ఎకరాల విస్తీర్ణంలో టీటీడీ నుంచి విస్తృత ఏర్పాట్లు చేస్తోందన్నారు. తిరుమల తరహాలో కైంకర్యాలు చేపట్టాలని ఆదేశించారు. శ్రీవారి కల్యాణోత్సవాలు, చక్రస్నానం తదితర కైంకర్యాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఆకట్టుకునేలా విద్యుత్ అలంకరణలు, పుష్పాలంకరణలు

- మిగతా 2వ పేజీలో



## కువైట్‌లో 21 నుంచి 2 రోజులు ప్రధాని మోదీ పర్యటన..!

3లో

## ఈ నెల 19న కాంగ్రెస్ ఎంపీలతో రాహుల్‌గాంధీ భేటీ..



3లో



## బాంబు బెదిరింపులకు పాల్పడితే కోటి జరిమానా

# జేపీసీకి జమిలి బిల్లులు!

(మొదటి పేజీ తరువాయి)

2024. జమిలి ఎన్నికలు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమంటూ ప్రతిపక్షాలు చేసిన ఆరోపణలను అర్జున్ రామ్ మేఘ్వాల్ కొట్టిపారేశారు. ఈ ఎన్నికలకు రాజకీయాలతో సంబంధం లేదని తేల్చిచెప్పారు. అసెంబ్లీ ఎన్నికలు, పార్లమెంట్ ఉభయ సభల ఎన్నికలు, రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎన్నికలు కేంద్ర జాబితాలోనే ఉన్నాయని గుర్తుచేశారు. రాష్ట్రాల అధికారాలను, రాజ్యాంగ మౌలిక స్వభావాన్ని ఈ బిల్లులు దెబ్బతీయవని, దేశ హితం కోసమే జమిలి ఎన్నికలు నిర్వహిస్తున్నామని స్పష్టం చేశారు. ప్రధాని మోదీ సూచనల మేరకు.. ఈ బిల్లులను విస్తృత చర్చల నిమిత్తం సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)కి నివేదించాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు చెప్పారు. జేపీసీలో దీనిపై విస్తృత చర్చలు జరుగుతాయని.. జేపీసీ నివేదికను క్యాబినెట్ ఆమోదిస్తుందని, అనంతరం ఈ బిల్లులపై సభలో మరోసారి చర్చ జరుగుతుందని కేంద్ర హెూం మంత్రి అమిత్ షా తెలిపారు. కాగా.. తొలుత ఈ బిల్లులను సభలో ప్రవేశపెట్టడాన్ని ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించడంతో దీనిపై ఓటింగ్ జరిగింది. దాంట్లో అనుకూలంగా 269 మంది ఓటు వేయగా, 198 మంది వ్యతిరేకంగా ఓటు వేశారు. కాగా.. జమిలి ఎన్నికలకు పూర్తి మద్దతునిస్తున్నామని టీడీపీ నేత, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ప్రకటించారు. తమ నేత చంద్రబాబు నాయుడు ఇలాంటి వినూత్న ఆలోచనల విషయంలో ఎప్పుడూ ముందు వరుసలో ఉంటారని పేర్కొన్నారు. 2024లో ఎన్నికలకు రూ.10వేల కోట్లకు పైగా ఖర్చయిందని, ఒకేసారి ఎన్నికలు జరిగితే 40% ఖర్చు తగ్గిపోతుందని లా కమిషన్, నీతీ ఆయోగ్ నివేదికలు కూడా సమర్పించాయని గుర్తుచేశారు. లోక్‌సభలో నలుగురు సభ్యులను కలిగి ఉన్న వైసీపీ కూడా ఈ బిల్లుకు మద్దతు తెలిపింది. అలా తెలిపిన ఏకైన ఎన్డీయేతర పార్టీ వైసీపీనే కావడం గమనార్హం. లోక్‌సభలో సభ్యులే లేని బీజేడీ వైఖరి ఇంకా తెలియాల్సి ఉంది. ఆ పార్టీకి రాజ్యసభలో ఏడుగురు సభ్యులున్నారు. ఇక.. విప్ జారీ చేసినప్పటికీ అనేక మంది బీజేపీ సభ్యులే మంగళవారం ఓటింగ్ సమయంలో సభకు గైర్హాజరు కావడం గమనార్హం. అలా సభకు రాని 20 మంది బీజేపీ ఎంపీలకు ఆ పార్టీ నోటీసులు పంపింది. మంగళవారం సభలో 467 మంది ఓటింగ్‌లో పాల్గొన్నారు. అందులో మూడింట రెండువంతుల మంది అంటే.. 311 మంది! కానీ అనుకూలంగా వచ్చిన ఓట్లు 269 మాత్రమే. సాధారణంగా రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదానికి సభలో మూడింట రెండొంతుల మంది సభ్యుల ఆమోదం అవసరం. బిల్లులను ప్రవేశపెట్టడానికి 2/3 మెజారిటీ అవసరం లేదుగానీ.. ఆ మెజారిటీని అధికార పక్షం ఇప్పుడే సమకూర్చుకోలేకపోవడం ఈ బిల్లు భవిష్యత్తును సూచిస్తోందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. కాంగ్రెస్, ఎన్సీపీ (ఎస్పీ), సమాజ్‌వాదీ పార్టీ, డీఎంకే, శివసేన (యూబీటీ), టీఎంసీ, అకాలీదళ్, ఎంఐఎం, ఐయూఎంఎల్, ఆరెస్పీ సహా 15 పార్టీలు ఈ బిల్లులను వ్యతిరేకించగా.. బీజేపీ,




తెలుగుదేశం పార్టీ, శివసేన (శిందే వర్గం) సహా 32 పార్టీలు సమర్థించాయి. రాజ్యాంగ మౌలిక స్వభావంపై ఈ బిల్లులు దాడి చేస్తున్నాయని, రాజ్యాంగంలోని కొన్ని అంశాలను పార్లమెంట్ కూడా మార్చలేదని కాంగ్రెస్ సభ్యులు మనీశ్ తివారీ, గౌరవ్ గొగోయ్ విమర్శించారు. రాష్ట్రాల ఎన్నికలను కూడా నిర్ణయించడం రాజ్యాంగానికి వ్యతిరేకమని మనీశ్ తివారీ మండిపడ్డారు. "ఇది రాజ్యాంగ వ్యతిరేక బిల్లు. దేశ సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధం. మేం దీన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం" అని కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ అన్నారు. "కేంద్ర ప్రభుత్వం పడిపోయినప్పుడు రాష్ట్ర ప్రభుత్వం కూడా ఎందుకు పడిపోవాలి?" అని కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ ప్రశ్నించారు. వేరొకరి టైమ్‌టేబుల్ కోసం.. ప్రజా తీర్పు మేరకు పాలన సాగిస్తు న్నవారి టైమ్‌టేబుల్ ఎందుకు కుచించుకుపోవాలి?" అని నిలదీశారు. ఒకవేళ ప్రస్తుత వ్యవస్థను జమిలి ఎన్నికలతో మార్చేసినా.. భవిష్యత్తులో కేంద్రంలోగానీ, రాష్ట్రంలోగానీ ప్రభుత్వం కూలిపోతే మళ్లీ ఇదే తరహా గందరగోళం ఏర్పడుతుందని థరూర్ అభిప్రాయపడ్డారు. కాబట్టి ఇప్పుడు జరుగుతున్న వ్యవహారమంతా నిరర్థకం, నిష్ఫలమని వ్యాఖ్యానించారు. ఇక.. జమిలి ఎన్నికలు నియంతృత్వానికి దారితీస్తాయని సమాజ్‌వాదీ ఎంపీ ధర్మేంద్ర యాదవ్ విమర్శించారు. దేశంలో భిన్నత్వాన్ని, సమాఖ్య స్ఫూర్తిని ఈ బిల్లు దెబ్బతీస్తుందని ఆయన ఆందోళన వెలిబుచ్చారు. లోక్‌సభ పదవీకాలానికి, శాసనసభ పదవీకాలానికి ఎలా ముడిపెడతారని తృణమూల్ ఎంపీ కల్యాణ్ బెనర్జీ ప్రశ్నించారు. ఈ బిల్లులు రాష్ట్రాల శాసనసభలకు ఉన్న స్వతంత్ర ప్రతిపత్తిని హరిస్తాయని అన్నారు. జమిలి ఆచరణ సాధ్యం కాదని, అది దేశంలో నియంతృ త్వపాలనకు దారితీస్తుందని.. ప్రజాస్వామ్యం, వైవిధ్యం దెబ్బతింటాయని డీఎంకే నేత టీఆర్ బాలు అన్నారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగ స్ఫూర్తికి ఈ బిల్లులు వ్యతిరేకమని ఎంఐఎం నేత అసదుద్దీన్ ఒవైసీ మండిపడ్డారు. ఇక.. జమిలి ఎన్నికలకు తమ పార్టీ వ్యతిరేకమని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా స్పష్టం చేశారు. 'ఒకే దేశం- ఒకే ఎన్నిక' విధానం సమాఖ్య స్ఫూర్తికి విఘాతం కలిగిస్తుందని, నియం తృత్వానికి దారితీస్తుందని ఆయన అభిప్రా యపడ్డారు. కాగా, భారత రాజ్యాంగాన్ని కాంగ్రెస్ పార్టీ నెహ్రూ-గాంధీ కుటుంబం వ్యక్తిగత జాగీరుగా, సొంత ఆస్తిగా మార్చుకొందని కేంద్ర హెూం మంత్రి అమిత్ షా విమర్శించారు. పార్లమెంటును మోసగించిందని ఆరోపిం చారు. మంగళవారం రాజ్యసభలో రాజ్యాంగంపై జరిగిన చర్చ ముగింపు సందర్భంగా ఆయన ప్రసంగించారు. భావ ప్రకటన స్వేచ్ఛను అడ్డుకోవడానికే నెహ్రూ ప్రథమ రాజ్యాంగ సవరణను తీసుకొచ్చారని తెలిపారు. శుక్రవారంతో శీతాకాల సమావేశాలు ముగియనున్న నేపథ్యంలో ఆలోగానే లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఈ బిల్లులపై జేపీసీని ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. అలా చేయలేకపోతే ఈ బిల్లులు మురిగిపోతాయి. వచ్చే సమావేశాల్లో మళ్లీ వీటిని ప్రవేశపెట్టాల్సి ఉంటుంది. కమిటీలో సభ్యుల కూర్పు.. సభలో ఆయా పార్టీలకు వచ్చిన సీట్లపై ఆధారపడి ఉంటుంది. సభలో అత్యధిక సీట్లున్న అతిపెద్ద పార్టీ బీజేపీ కాబట్టి జేపీసీలో ఆ పార్టీ సభ్యులు ఎక్కువ మంది ఉంటారు. కమిటీకి నాయకత్వం వహించే అవకాశం కూడా ఆ పార్టీకే దక్కుతుంది. జేపీసీలో గరిష్ఠంగా 31 మంది ఎంపీలు ఉంటారు. అందులో 21 మంది లోక్‌సభ నుంచి ఉంటారు. జేపీసీ 90 రోజుల్లోగా నివేదికను సమర్పించాల్సి ఉంటుంది. అవసరమైతే ఆ గడువును పొడిగించవచ్చు.



## మహాకుంభ మేళలో శ్రీవారి నమూనా ఆలయానికి విస్తృత ఏర్పాట్లు : టీటీడీ

(మొదటి పేజీ తరువాయి)

చేపట్టాలని తెలిపారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్ర అధికారులతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుని టీటీడీకి కేటాయించిన స్థలంలో రాజీలేకుండా మెరుగైన ఏర్పాట్లు చేపట్టాలన్నారు. హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో భజన కార్యక్రమాలు, కళా బృందాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. యూపీ పోలీస్ అధికారులతో టీటీడీ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ అధికారులు సమన్వయం చేసుకుని పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేయాలన్నారు. సమావేశంలో ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాల దీక్షితులు, డీపీపీ సెక్రటరీ రఘునాథ్, ప్రోగ్రాం ఆఫీసర్ రాజగోపాల్, అధికారులు పాల్గొన్నారు.

## కేటీఆర్‌పై విచారణకు రంగం సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)

ఆర్‌బీఐ అనుమతి లేకుండా రూ.46 కోట్ల మేర విదేశీ కరెన్సీ చెల్లించడం వంటి వ్యవహారాలపై పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి ఫిర్యాదు మేరకు ఏసీబీ ఇప్పటికే కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఇందులో కేటీఆర్‌తోపాటు పురపాలకశాఖ అప్పటి ప్రత్యేక కార్యదర్శి అర్వింద్‌కుమార్‌ను, చీఫ్ ఇంజినీర్‌ను బాధ్యులుగా పేర్కొన్నారు. అధికారులపై విచారణకు ప్రభుత్వం ఇంతకుముందే అనుమతి ఇచ్చింది. కేటీఆర్‌పై కేసు నమోదుకు గవర్నర్ నుంచి అనుమతి కోరగా, సుమారు నెల రోజుల తర్వాత ఇటీవల అనుమతి లభించింది.

## కాంగ్రెస్‌ను దించేందుకు ఉపాయం ఉందా అని ప్రజలు అడుగుతున్నారు : కేటీఆర్



(మొదటి పేజీ తరువాయి)

ఉందని కేటీఆర్ తెలిపారు. నరేందర్ రెడ్డి గుండె ధైర్యానికి సెల్యూట్ చేయాలని అన్నారు. రేవంత్ రెడ్డి ఏడాది కింద రాష్ట్రమంతటా తిరిగి దొంగ హామీలు ఇచ్చారని కేటీఆర్ విమర్శించారు. రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలపై చర్చకు ఎక్కడికైనా సిద్ధమని స్పష్టం చేశారు. రూ.2లక్షల రైతు రుణమాఫీ ఎక్కడైనా పూర్తయ్యిందా అని ప్రశ్నించారు. దీనిపై చర్చకు వస్తారా అని సవాలు విసిరారు. ఒక్క ఊళ్లో అయినా వంద శాతం రైతు రుణమాఫీ చేసినట్లు చూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటానని తెలిపారు. ఏడాది కడుపు కట్టుకుంటే 49 కోట్లు మాఫీ చేస్తామని రేవంత్ బీరాలు పలికారని అన్నారు. కానీ ఇప్పటివరకు రైతుల ఖాతాలో 13 కోట్లకు మించి పడలేదని చెప్పారు. వానాకాలంలో రైతుభరోసాను ఎగ్గొట్టిండని మండిపడ్డారు. బీఆర్ఎస్ ఇచ్చిన రూ.10వేల రైతుబంధు కూడా ఇవ్వడం లేదని అన్నారు. రాహుల్ గాంధీ నుంచి మొదలుపెడితే కాంగ్రెస్ నేతలు చెప్పినవన్నీ అబద్ధాలే అని కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్‌కు ఓటేసినందుకు ప్రజలు ఇప్పుడు బాధపడుతున్నారని కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని దించేందుకు ఏదైనా ఉపాయం ఉందా అని ప్రజలంతా అడుగుతున్నారని తెలిపారు. నీలి రంగు నక్కను ఎప్పుడు వదిలించుకుందామా అని తెలంగాణ సమాజం ఎదురుచూస్తోందని తెలిపారు. రోషం ఉన్నవాడైతే ప్రజల తిట్లకు రేవంత్ రెడ్డి ఎప్పుడో చచ్చిపోతుండే అని ఎద్దేవా చేశారు.

## ప్రతి డాక్టర్ సేవకే ప్రాధాన్యత ఇవ్వాలి: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

(మొదటి పేజీ తరువాయి)

దేశ ప్రజలకు ఆరోగ్య సేవలు తేలిగ్గా అందించడమే ధ్యేయంగా ఉండాలని కోరారు. పట్టాలు పొందిన యువ వైద్యుల్లో 2/3 వంతు మహిళా డాక్టర్లు ఉన్నారనని, భారత మహిళలు, యువతులు అన్ని రంగాల్లో ఉన్నతి సాధించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ పూర్తి ఆరోగ్యంపై దృష్టిని సారించాలని, ప్రాణాపాయాలు, యోగాసనాలు చేయాలన్నారు. ప్రపంచపటంలో భారతదేశం మెడికల్ సేవలలో అందుబాటులో ఉండే దేశంగా నిలవటానికి డాక్టర్ల సేవలు మరువలేనివని,ఆరోగ్యకరమైన, అభివృద్ధి సాధించే భారతదేశం మనందరికీ కావాలని సూచించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ రాష్ట్రపతిని ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. మెడికల్ అనేది ఇప్పుడు మెడ్‌టెక్‌గా మారిపోయిందని అన్నారు. మంగళగిరికి 10 ఎకరాలు ఇస్తామని, అవకాశముంటే తనకు ఇక్కడ చదువుకోవాలని ఉందని పేర్కొన్నారు. కొలనుకొండలో రీసెర్చ్ సెంటర్, ఐఐటీతో అనుసంధానించాలని భావిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో గవర్నర్ అబ్దుల్ నజీర్, కేంద్ర మంత్రులు ఆయూష్, ప్రకాష్‌రావు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రులు నారా లోకేష్, సత్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పేర్ని నాని రెండో గోదాముపై కూడా అనుమానాలు ఉన్నాయి.. ఏపీ మంత్రి నాదెండ్ల మనోహర్ కీలక వ్యాఖ్యలు

పేర్ని నాని వ్యవహారంలో ఎలాంటి కక్ష సాధింపు చర్యలు లేవని ఏపీ పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. చట్టం నుంచి ఎవరూ తప్పించుకోలేరని స్పష్టం చేశారు. పేర్ని నానికి చెందిన రెండో గోదాములపై కూడా తమకు అనుమానాలు ఉన్నాయని అన్నారు. గోదాముల్లో స్టాక్స్ తగ్గిందని నవంబర్ 27న మచిలీపట్నం జేఎస్ గోడౌన్స్ చెప్పిందని నాదెండ్ల మనోహర్ తెలిపారు. మూడు వేల బ్యాగుల షార్టేజి కనబడుతుందని చెప్పిందన్నారు. గోదాముల్లో మాయమైన ధాన్యానికి ఎంత విలువైతే అంత డబ్బులు చెల్లిస్తామని పేర్ని నాని సతీమణి జయసుధ లేఖ రాశారని తెలిపారు. పేర్ని నానికి చెందిన రెండో గోడౌన్‌పై కూడా తమకు అనుమానాలు ఉన్నాయని తెలిపారు. ఆ ఆధారాలను ధ్వంసం చేయడానికి ప్రయత్నించారని ఆరోపించారు. పేర్ని నాని వ్యవహారంలో ఎలాంటి కక్ష సాధింపు చర్యలు లేవని ఆయన స్పష్టం చేశారు. చట్టం నుంచి ఎవరూ తప్పించుకోలేరని అన్నారు. రూల్ ఆఫ్ లా ఇంప్లిమెంట్ కావాల్సిందేనని తెలిపారు. అనవసరంగా ఎవరిపైనా కక్ష సాధింపు చర్యలు ఉండవని.. తప్పు



చేసిన ఎవర్నీ ఈ ప్రభుత్వం వదలదని స్పష్టం చేశారు. ప్రతి గోడౌన్‌లో ఎంత స్టాక్ ఉందో లెక్కలు తీయడం మొదలుపెట్టామని తెలిపారు. క్షేత్రస్థాయిలో వాస్తవాలు వెలుగులోకి రావాల్సిందేనని స్పష్టం చేశారు. పేర్ని నానికి లుక్‌అవుట్ నోటీసులు ఇచ్చిన నేపథ్యంలో వైసీపీ నేతలు పరామర్శించడాన్ని ఏపీ మంత్రి కొల్లు రవీంద్ర తప్పుబట్టారు. రూ.90 లక్షల విలువైన 187 టన్నుల బియ్యాన్ని పేర్ని నాని కుటుంబం తినేసిందని దుయ్యబట్టారు.

# అప్పులకుప్పపై సభలో అధికార ప్రతిపక్షాల వాగ్యుద్ధం

(మొదటి పేజీ తరువాయి)

ప్రతిసవాళ్లకు దారి తీసింది. 'ఏడాదిలో రూ.1.27 లక్షల కోట్ల అప్పేంటి? ఇలాగైతే ఐదేండ్లలో రాష్ట్ర అప్పు 6.37 లక్షల కోట్లకు చేరుకుంటుంది. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేండ్లలో చేసిన అప్పు కేవలం రూ.4.17 లక్షల కోట్లే' అని హరీశ్‌రావు వివరించగా.. డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. అందులో గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులు, వడ్డీలకే రూ.66 వేల కోట్లు చెల్లించాం. గత ప్రభుత్వం 40 వేల కోట్ల రూపాయల పెండింగ్ బిల్లులను మాపై రుద్దిపోయింది. వాటిని క్లియర్ చేసుకుంటూ వస్తున్నాం. గత ప్రభుత్వం మాదిరిగా అప్పుల లెక్కలు దాచం. ప్రజల ప్రతిపైసాకూ జవాబుదారీగా ఉంటాం. ఇది లఘు చర్చ కాదు. ప్రశ్నోత్తరాల సమయం. ఇప్పటికే రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రం విడుదల చేశాం. ప్రతిపక్ష సభ్యులు అడుగుతున్నారు కాబట్టి దీనిపై మరోమారు సుదీర్ఘంగా చర్చించేందుకు మేం సిద్ధం' అని కౌంటర్ ఇచ్చారు. ఇలా ఇద్దరి మధ్యా అరగంటకుపైగా చర్చ నడిచింది.

### అప్పులు రాష్ట్రానికి క్షేమకరం కాదు : హరీశ్‌రావు

రాష్ట్రంలో ఎఫ్ఆర్‌బీఎం, దాని కిందకు రాని రుణాలపై టి.హరీశ్‌రావు, ప్రశాంత్‌రెడ్డి, పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి భట్టి విక్రమార్క సమాధానమిచ్చారు. 2024 నవంబర్ నాటికి ప్రభుత్వ, ప్రభుత్వేతర రంగాలకు గ్యారంటీ ఇచ్చింది రూ. 51,277.71 కోట్లు, డ్రా చేసిన మొత్తం రూ.51,891,44 కోట్లు, 2023 డిసెంబర్ నుంచి 2024 నవంబర్ వరకు డ్రా చేసిన ఎఫ్ఆర్‌బీఎం రుణాలు రూ.52,118 కోట్లు, అదే సమయంలో కార్పొరేషన్లు, ఎస్‌పివిలు డ్రా చేసిన ఎఫ్ఆర్‌బీఎం యేతర రుణాలు రూ.61,991 కోట్లు, ప్రభుత్వ పూచీ



లేకుండా ప్రభుత్వ రంగ సంస్థలు నవంబర్ 30వరకు తీసుకున్న రుణాలు రూ.10,099.70 కోట్లు అని వివరించారు. అనంతరం హరీశ్‌రావు మాట్లాడుతూ..ఏడాది కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం రూ.1,27,208 కోట్ల అప్పు చేసిందనీ, ఇలాగైతే ఐదేండ్లలో రూ.6,37,047 కోట్లకు చేరుకుంటుందని వివరించారు. ఇది రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు క్షేమకరం కాదని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేండ్ల కాలంలో చేసిన అప్పు 4,17,496 కోట్లు మాత్రమే అని చెప్పారు. అంత అప్పు కావడానికి వరుసగా రెండేండ్లు కరోనాతో ఆర్థిక సంక్షోభం నెలకొనడం, 1.7 శాతం అదనంగా తీసుకునేందుకు కేంద్రం అనుమతి ఇవ్వడం వల్లనే చేరిందని చెప్పారు.

### ప్రశ్నోత్తరాల సమయంలో ఉపన్యాసాలేంటి? రూల్స్ బుక్‌ను మార్చేశారు : మంత్రి భట్టి

మంత్రి భట్టి జోక్యం చేసుకుని మాట్లాడుతూ..'ఇది క్వశ్చన్ అవర్. స్వల్పకాల చర్చ మాదిరిగా హరీశ్‌రావు ఉపన్యాసమేంటి? ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు మాత్రమే ఇస్తారు. చర్చ ఉండదు. కావాలంటే ఇదే అంశంపై సభలో ప్రత్యేకంగా చర్చ పెడుదాం. ప్రతి పైసాకు జవాబుదారీగా ఉంటాం. గతంలోనే రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రం విడుదల చేశాం' అని అన్నారు. హరీశ్‌రావు సత్యదూరపు మాటలు మాట్లాడటం తగదన్నారు. బహుషా నిజాలు మాట్లాడితే వారి తలలు పగిలిపోతాయో ఏమో? అని చురకలు అంటించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో శాసనసభ రూల్స్ బుక్ నిబంధనలను మార్చేశారని విమర్శించారు. సభలో ప్లకార్డులు ప్రదర్శించొద్దు..నినాదాలు చేయొద్దు అని స్పష్టంగా ఉన్నా ఇదేం పద్ధతి అని ప్రశ్నించారు. 'సభాసాక్షిగా గత సీఎం దళితులకు మూడెకరాల భూమి ఇస్తామన్నారు..ఇచ్చారా? డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇచ్చారా? ఉద్యోగాలు ఇచ్చారా?' అని కడిగిపారేశారు. బీఆర్ఎస్ సభ్యులు సభా నియమాలు, నిబంధనలు గురించి మాట్లాడితే విడ్డూరంగా ఉందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులు, వడ్డీలకు రూ.66 వేలు కట్టామనీ, ఈ విషయాన్ని బహిరంగంగా చెబుతున్నామని అన్నారు. వ్యవసాయ కూలీలకు 12 వేలు ఇవ్వొద్దా? దానిపై ప్రివిలైజ్ మోషన్ ఏంటి? అప్పులు తీసుకున్న ప్రతి పైసాకూ లెక్క ఉంది. గత ప్రభుత్వం మాదిరిగా మేం దాచిపెట్టలేదు. కార్పొరేషన్ల ద్వారా తీసుకున్న రుణాలు ఏనాడైనా చూపెట్టారా? రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ఎప్పుడైనా తాము చర్చకు సిద్ధం ' అని ప్రకటించారు. తమ ప్రభుత్వం తీసుకున్న అప్పు రూ.52 వేల కోట్లే అని చెప్పారు. గత ప్రభుత్వం విద్యుత్ సంస్థలకు బకాయి పడితే తాము చెల్లిస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన రూ.40 వేల కోట్ల రూపాయలను పెండింగ్ పెట్టిందని విమర్శించారు. తాము వాటిని క్లియర్ చేస్తూ పోతున్నామన్నారు. రైతుల నుంచి ప్రతి గింజా కొంటున్నామనీ, సన్నాలకు రూ.500 బోనస్ కూడా చెల్లిస్తున్నామని చెప్పారు. రైతుల ఖాతాల్లో మూడు రోజుల్లోనే డబ్బులు వేస్తున్నామని చెప్పారు.

### ప్రసాద్ కుమార్ స్పీకర్ కాదా? ఆయనకు నిర్ణయాధికారం లేదా? : భట్టి

'బీఏసీ సమావేశం ఏనాడైనా గత ప్రభుత్వం సక్రమంగా నిర్వహించిందా? సభను ఎన్ని రోజులు నడపాలి? ఏయే అంశాలు చర్చించాలి? అనే దానిపై కాగితంపై రాసిస్తే స్పీకర్ ఫైనల్ చేసిన విషయం వాస్తవం కాదా? గతంలో ఆ స్థానంలో పోచారం ఉన్నారు..ఇప్పుడు ప్రసాద్ కుమార్ వచ్చారు. అవే నిబంధలను పాటిస్తున్నారు. దీనిని తప్పుబడుతూ బీఏసీలో బీఆర్ఎస్ పక్షం వాళు పేపర్లు విసిరేసి పోవడమేంటి? ఇదేం పద్ధతి? ప్రసాద్‌కుమార్ స్పీకర్ కాదా? ఇది కరెక్టు కాదు. స్పీకర్ ప్రసాద్‌కుమార్ అటాక్ చేయడం మంచి పద్ధతి కాదు. అన్నీ నిబంధనల మేరకే నడుస్తాయి. మేం చెప్పినట్టు సభ నడ వాలనుకోవడం సరిగాదు' అంటూ హరీశ్‌రావుకు చురకలు అంటించారు. 'మాకు నీతులు చెబుతున్నారు. వికారాబాద్ ప్రజలు చూస్తున్నారు.

# రైతులకు కాంగ్రెస్ ఏమీ చేయదు..

**కాంగ్రెస్ పార్టీపై ప్రధాని మోదీ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. రైతుల పేరుతో కాంగ్రెస్ పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతుందని, కానీ వారి కోసం ఏమీ చేయదని, ఇతరులనూ చేయనివ్వదని ఆరోపించారు.**






కాంగ్రెస్ పార్టీపై ప్రధాని మోదీ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. రైతుల పేరుతో కాంగ్రెస్ పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతుందని, కానీ వారి కోసం ఏమీ చేయదని, ఇతరులనూ చేయనివ్వదని ఆరోపించారు. రాజాస్థాన్‌లో భజన్‌లాల్ ప్రభుత్వం ఏడాది పాలనను పూర్తిచేసుకున్న సందర్భంగా మంగళవారం నిర్వహించిన 'ఏక్ వర్ష్- పరిణామ్ ఉత్కర్ష్' కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. రాష్ట్రాల మధ్య ఉన్న జల వివాదాలకు పరిష్కారాన్ని కనుగొనడానికి బదులుగా కాంగ్రెస్ వాటిని ప్రోత్సహిస్తోందని, తూర్పు రాజస్థాన్ కెనాల్ ప్రాజెక్టును ఆ పార్టీ ఉద్దేశపూర్వకంగా జాప్యం చేయడమే దీనికి ప్రత్యక్ష నిదర్శనమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రూ.46,300 కోట్లకు పైగా విలువైన 24 ప్రాజెక్టులకు మోదీ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. మరోవైపు, ప్రధాని మోదీ ఈ నెల 21 నుంచి కువైత్‌లో రెండు రోజుల పాటు పర్యటించనున్నారు. 1981 తర్వాత ఈ దేశంలో భారత ప్రధాని పర్యటించడం ఇదే మొదటిసారి.




## ఎంఎస్పీకి చట్టబద్ధత కల్పించాలి పీఎం కిసాన్ సాయాన్ని రెట్టింపు చేయాలి

పంటల కనీస మద్దతు ధరలకు (ఎంఎస్పీ) చట్టబద్ధత కల్పించాలని పార్లమెంటరీ స్థాయి సంఘం కేంద్రానికి మంగళవారం సిఫారసు చేసింది. దీని వల్ల రైతుల ఆత్మహత్యలను తగ్గించడంతో పాటు వారికి ఆర్థిక స్థిరత్వం కల్పించవచ్చని తెలిపింది. అలాగే పీఎం కిసాన్ పథకం కింద ప్రస్తుతం రైతులకు ఏటా అందిస్తున్న రూ.6 వేల ఆర్థిక సాయాన్ని రూ.12 వేలకు పెంచాలని ప్రతిపాదించింది. వ్యవసాయం, పశు సంవర్ధకం, ఆహార ప్రాసెసింగ్‌పై ఏర్పాటైన ఈ ప్యానెల్ ఈ మేరకు పార్లమెంట్‌కు సమగ్ర నివేదిక సమర్పించింది. 'వీలైనంత త్వరగా ఎంఎస్పీని చట్టబద్ధంగా అమలు చేయడానికి ఒక మార్గ సూచిని రూపొందించాలని వ్యవసాయ శాఖకు ప్యానెల్ గట్టిగా ప్రతిపాదించింది' అని నివేదిక పేర్కొంది. పంట వ్యర్థాల నిర్వహణకు పరిహారం అందించడం, వ్యవసాయ కూలీలకు కనీస జీవన వేతనాల అమలు కోసం జాతీయ కమిషన్ ఏర్పాటు, రైతులు, రైతు కూలీల కోసం రుణ మాఫీ పథకం ప్రవేశపెట్టడం తదితర సిఫారసులను చేసింది. ఎంఎస్పీ ద్వారా వచ్చే ఆదాయం రైతులను వ్యవసాయంలో మరిన్ని పెట్టుబడులు పెట్టేలా చేస్తుందని కమిటీ వివరించింది. ప్రతి పంట కాలం తర్వాత ప్రభుత్వం పార్లమెంట్‌లో ఎంఎస్పీకి పంటలను అమ్ముతున్న రైతుల సంఖ్యను, ఎంఎస్పీకి-మార్కెట్ ధరలకు ఉన్న వ్యత్యాసాన్ని ప్రకటించాలని పార్లమెంటరీ కమిటీ కోరింది.

## నిలకడగా బీజేపీ సీనియర్ నేత అద్వానీ ఆరోగ్యం..!



బీజేపీ అగ్రనేత లాల్ కృష్ణ అద్వానీ ఆరోగ్యం నిలకడగా ఉందని ఢిల్లీలోని ఇంద్రప్రస్త అపోలో దవాఖాన మంగళవారం ఓ బులెటిన్ విడుదల చేసింది. నెమ్మదిగా కోలుకుంటున్నారని, ఒకటి, రెండు రోజుల్లో ఆయన్ను ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (ఐసీయూ) నుంచి షిఫ్ట్ చేస్తామని దవాఖాన యాజమాన్యం ధృవీకరించింది. ఈ నెల 12 నుంచి ఐసీయూలోనే అద్వానీ చికిత్స పొందుతున్నారు. 'భారత ఉప ప్రధాని ఎల్ కే అద్వానీ.. ఇంద్రప్రస్తలోని అపోలో దవాఖానలో ఈ నెల 12 నుంచి డాక్టర్ వినీత్ సూరి పర్యవేక్షణలో చికిత్స పొందుతున్నారు. క్రమంగా ఆయన ఆరోగ్య పరిస్థితి మెరుగు పడుతున్నది. ఆరోగ్య పరిస్థితిని బట్టి ఒకటి, రెండు రోజుల్లో ఐసీయూ నుంచి బయటకు తరలిస్తాం' అని దవాఖాన తెలిపింది. గత ఆగస్టులో కూడా అపోలో దవాఖానలో అద్వానీ చికిత్స పొందారు. ఈ ఏడాది ప్రారంభంలో ఎయిమ్స్ లో చికిత్స పొందారు. గత మార్చిలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆయనకు భారత్ రత్న పురస్కారం అందజేశారు. 1927 నవంబర్ ఎనిమిదో తేదీన కరాచీ (ప్రస్తుతం పాకిస్థాన్)లో అద్వానీ జన్మించారు. 1942లో ఆర్ఎస్ఎస్ స్వయం సేవక్ గా చేరారు. 1986-1990, 1993-98, 2004-05 మధ్య బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా అద్వానీ పని చేశారు.




## వన్ నేషన్, వన్ ఎలక్షన్ బిల్లు రాజ్యాంగ విరుద్ధం : డీఎంకే ఎంపీ కనిమొళి

'ఒకే దేశం, ఒకే ఎన్నిక బిల్లును తాము వ్యతిరేకిస్తున్నట్లు లోక్‌సభలో ఖరాఖండిగా చెప్పామని డీఎంకే ఎంపీ కనిమొళి చెప్పారు. వన్ నేషన్, వన్ ఎలక్షన్ బిల్లు రాజ్యాంగ విరుద్ధమని, అందుకే తాము దాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని ఆమె తెలిపారు. వన్ నేషన్, వన్ ఎలక్షన్ బిల్లు సమాఖ్య హక్కులకు, ప్రజల ఆకాంక్షలకు కూడా విరుద్ధమని అన్నారు. ప్రజలు రాష్ట్ర ప్రభుత్వాలను ఐదేళ్ల కాలానికి ఎన్నుకుంటారని, కానీ మీరు వాళ్ల హక్కును దూరం చేస్తారని అనుకోవడం లేదని కనిమొళి వ్యాఖ్యానించారు. ప్రభుత్వం ఎన్నేళ్లు ఉండాలనే అధికారాన్ని ప్రజల నుంచి లాక్కుని కేంద్ర ఎన్నికల సంఘానికి ఇవ్వడం కరెక్ట్ కాదని అన్నారు. అలా చేయడం రాష్ట్రాలకు, సమాఖ్య స్ఫూర్తికి, రాజ్యాంగానికి వ్యతిరేకమని అన్నారు. కేంద్రం ఆ బిల్లును అమల్లోకి తీసుకొస్తే రాజ్యాంగ ప్రాథమిక సూత్రాలకు విఘాతం కలుగుతుందని అన్నారు. కాబట్టి తాము ఈ బిల్లును అంగీకరించబోమని అన్నారు. ఇవాళ కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్‌వాల్ వన్ నేషన్, వన్ ఎలక్షన్ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టారు. దాంతోపాటే బిల్లును జేపీసీకి పంపాలని ప్రతిపాదించారు. ఆ ప్రతిపాదనపై లోక్‌సభలో ఓటింగ్ నిర్వహించి జేపీసీకి అప్పగించారు.



## బాంబు బెదిరింపులకు పాల్పడితే కోటి జరిమానా

నకిలీ బాంబు బెదిరింపులను అడ్డుకునేందుకు కేంద్రం..విమానయాన భద్రతా నియమాలను సవరించింది. భారత్‌లో ఇకపై ఎవరైనా నకిలీ బాంబు బెదిరింపులతో విమాన రాకపోకల్ని ప్రభావితం చేస్తే..దోషులకు కోటి రూపాయల వరకు జరిమానా విధించనున్నారు. ఈమేరకు సవరించిన విమానయాన భద్రతా నిబంధనలను నోటిఫై చేస్తూ కేంద్రం తాజాగా ఉత్తర్వులు జారీచేసింది. భారత్‌లో ఇటీవల కొన్ని వందలాది విమానాలకు నకిలీ బాంబు బెదిరింపులు వెలువడ్డాయి. దీంతో ప్రయాణికులు, విమాన సిబ్బంది..ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. దారిమళ్లింపు, సెక్యూరిటీ ప్రొటోకాల్ వంటి చర్యల వల్ల విమానయాన సంస్థలపై పెద్ద మొత్తంలో ఆర్థికభారం పడింది.

## కువైట్‌లో 21 నుంచి రెండు రోజులు ప్రధాని మోదీ పర్యటన..!



కువైట్ ఆహ్వానం మేరకు డిసెంబర్ 21వ తేదీ నుంచి రెండు రోజుల అధికారిక పర్యటన నిమిత్తం ప్రధాని నరేంద్రమోదీ ఆ దేశంలో పర్యటిస్తారు. కువైట్ అమీర్ షేక్ మెషల్ అల్-అహ్మద్ అల్-జాబర్ అల్-సబా, క్రౌన్ ప్రిన్స్ షేక్ సబా అల్-ఖాలీద్, ప్రధాని అహ్మద్ అల్ అబ్దుల్లా అల్ సబాహ్ తదితరులతో ప్రధాని మోదీ ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించనున్నారు. ప్రధాని మోదీ తన పర్యటనలో భాగంగా భారతీయ కమ్యూనిటీ సంఘాలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. ఈ నెల 22న కువైట్ ఉన్నత అధికారులతో ఆయన అధికారికంగా చర్చించనున్నారు. కువైట్‌లో దాదాపు 10 లక్షలమంది భారతీయులు నివసిస్తున్నారు. 2014లో ప్రధానిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఇప్పటివరకు మోదీ పర్యటించని ఏకైక జీసీసీ సభ్య దేశం కువైట్. 1981లో కువైట్‌ను సందర్శించిన చివరి భారత ప్రధాని ఇందిరా గాంధీ. 43 ఏండ్ల విరామం తర్వాత కువైట్‌లో ప్రధాని స్థాయి పర్యటన జరుగుతోంది. భారతదేశం, కువైట్ మధ్య లోతైన చారిత్రక సంబంధాలు, వ్యూహాత్మక ప్రాముఖ్యత, బలమైన ద్వైపాక్షిక సంబంధాలు ఉన్నాయి. కువైట్ ఇంధన సహకారంలో ముఖ్యమైన భాగస్వామి మాత్రమే కాదు ఆ దేశ శ్రామికశక్తికి వెన్నెముకగా ఉండే పెద్ద భారతీయ ప్రవాస సమాజానికి కూడా ఆతిథ్యం ఇస్తున్నది.



## ట్రావెల్ ఏజెంట్ మోసం.. 22 ఏండ్ల తర్వాత భారత్‌కు

ట్రావెల్ ఏజెంట్ చేతిలో మోసపోయి 22 ఏండ్లుగా పాకిస్థాన్‌లో ఉన్న భారతీయ మహిళ సోమవారం స్వదేశానికి చేరుకుంది. వాఘా సరిహద్దు నుంచి ఆమె భారత్‌లోకి ప్రవేశించిందని ఓ అధికారి తెలిపారు. బాధితురాలైన హమీదా బానో కథనం ప్రకారం ముంబైకి చెందిన ఆమె 2002లో పాకిస్థాన్‌లోని హైదరాబాద్‌కు వచ్చింది. దుబాయ్‌లో వంట మనిషి ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి ఆమెను మోసం చేసిన ఓ ట్రావెల్ ఏజెంట్ ఆమెను పాకిస్థాన్‌లో వదిలి పెట్టి వెళ్లిపోయాడు. ఆమె అక్కడే ఒక పాకిస్థానీని పెండ్లి చేసుకొంది. 2022లో స్థానిక యూట్యూబర్ ఆమె గురించి చేసిన వ్లాగ్ ఆమెను తిరిగి కుటుంబం దగ్గరకు చేరేలా చేసింది.

## ఈ నెల 19న కాంగ్రెస్ ఎంపీలతో రాహుల్‌గాంధీ భేటీ..



లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ ఎంపీ రాహుల్‌గాంధీ ఈ నెల 19న తమ పార్టీ ఎంపీలతో భేటీ కానున్నారు. పార్లమెంట్ హౌస్ అన్నెక్సేలో ఈ భేటీ జరగనుంది. వన్ నేషన్, వన్ ఎలక్షన్ బిల్లు, రైతులకు కనీస మద్దతు ధర, ద్రవ్యోల్బణం, నిరుద్యోగం తదితర అంశాలపై పార్లమెంటులో అనుసరించాల్సిన విధానంపై ఈ సమావేశంలో చర్చించనున్నారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ప్రారంభమైనప్పటి నుంచి ఉభయసభల్లో వాయిదాల పర్వం కొనసాగుతున్నది. గౌతమ్ అదానీ అంశం, రైతులకు కనీస మద్దతు ధర తదితర అంశాలపై చర్చకు విపక్షాలు పట్టుబట్టడంతో సభలు వాయిదాపడుతూ వచ్చాయి. చివరకు ఈ నెల 13, 14 తేదీల్లో లోక్‌సభలో, ఈ నెల 16, 17 తేదీల్లో రాజ్యసభలో రాజ్యాంగంపై చర్చ జరిగింది. రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా పార్లమెంట్ ఉభయసభల్లో రాజ్యాంగంపై చర్చ జరిపారు. ఈ సందర్భంగా ఉభయసభల్లో వాడీవేడి చర్చ జరిగింది. రాజ్యాంగాన్ని దేశ పరిస్థితులకు అనుకూలంగా మార్చకుండా కాంగ్రెస్ పాలకులు వందలకొద్ది సవరణలు చేస్తూ వచ్చారని ప్రభుత్వం విమర్శించింది. దేశంలో కోసం ఇంతవరకు ఏమీ చేయని బీజేపీ మాకు రాజ్యాంగం గురించి పాఠాలు చెప్పడం విడ్డూరంగా ఉందని కాంగ్రెస్ పార్టీ మండిపడింది. ఈ క్రమంలో ఈ నెల 19న రాహుల్‌గాంధీ కాంగ్రెస్ ఎంపీలతో భేటీ కానుండటం ప్రాధాన్యం సంతరించుకుంది. రాజ్యాంగంపై చర్చ జరిగిన రెండు రోజులు మినహా ఈ పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ఇంతవరకు ఉభయసభలు సజావుగా సాగలేదు. ఇకముందైనా సభాకార్యకలాపాలు సజావుగా సాగుతాయా లేదా..? అనేది అనుమానంగా ఉన్నది.



## హష్ మనీ కేసులో ట్రంప్‌కు ఎదురుదెబ్బ

అధ్యక్షుడికి న్యాయ రక్షణ ఉంటుందన్న కారణాన్ని చూపి హష్ మనీ కేసులో తనను దోషిగా నిర్ధారిస్తూ ఇచ్చిన తీర్పును కొట్టివేయాలంటూ అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్ చేసిన అభ్యర్థనను న్యాయమూర్తి తిరస్కరించారు. దీంతో ట్రంప్ భవితవ్యం సందిగ్ధంలో పడింది. అధ్యక్షుడిగా అధికారిక చర్యలకు మాత్రమే న్యాయరక్షణ ఉంటుందని, అనధికారిక చర్యలకు కాదని మన్‌హట్టన్ జడ్జి జువాన్ ఎం మెర్చన్ సోమవారం స్పష్టం చేశారు. శృంగార తార స్టార్మీ డానియల్స్‌తో వ్యవహారం బయట పడకుండా ట్రంప్ ఆమెకు 1.10 కోట్లు ముట్టచెప్పారనేది ఆరోపణ.

## 7.3 తీవ్రతతో భారీ భూకంపం..

# ధ్వంసమైన భవనాలు..



పసిఫిక్ ద్వీప దేశం వనౌటు భారీ భూకంపం కుదిపేసింది. దక్షిణ పసిఫిక్ మహాసముద్రంలో ఉన్న వనౌటు తీరంలో మంగళవారం ఉదయం అత్యంత శక్తిమంతమైన భూకంపం సంభవించింది. రిక్టరు స్కేలుపై భూకంపం తీవ్రత 7.3గా నమోదైంది. దేశంలోనే అతిపెద్ద నగరమైన రాజధాని పోర్ట్ విలాకు పశ్చిమాన 57 కిలోమీటర్ల లోతులో ఈ భూకంప కేంద్రాన్ని గుర్తించారు. 7.3 తీవ్రత తర్వాత ఇదే ప్రాంతంలో పలు మార్లు 5.3 తీవ్రతతో భూ ప్రకంపనలు నమోదయ్యాయి. భూకంపం ధాటికి ఎత్తైన భవనాలు ఊగిపోయాయి. అనేక భవనాలు, కార్లు దెబ్బతిన్నాయి. పోర్ట్ విలాలోని యూఎస్, యూకే, ఫ్రాన్స్ సహా పలు దేశాల రాయబార కార్యాలయాలు ఉన్న భవనం ధ్వంసమైనట్లు స్థానిక మీడియా పేర్కొంది. ఈ భూకంపం ఘటనలో భారీగా ఆస్తి, ప్రాణ నష్టం సంభవించినట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించిన దృశ్యాలు ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతున్నాయి.



## ఆలయ పాలక వర్గం ఎన్నిక

**(ప్రజాతీర్పు ప్రతినిధి, కరీంనగర్)**

కొత్తయాస్వాడలోని శ్రీభక్తాంజనేయ స్వామి,పోచమ్మ దేవాలయంలో నూతన పాలకవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులు గా ర్యాకం సుధాకర్ పటేల్, ప్రధాన కార్యదర్శిగా న్యాలకొండ రవీందర్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా బొమ్మెన గిరిధర్ సతీష్, రేగుల సంజీవ్ కుమార్ ముదిరాజ్, కట్ట నవీన్ కుమార్ లు ఎన్నిక అయ్యారు. కోశాధికారిగా గుమ్మడి రాజయ్య, ప్రచార కార్యదర్శిగా కూర్మాచలం మునిందర్, చంద్రగిరి వెంకటేశ్వర్లు, కార్యదర్శిగా తోటరాజు, తోట శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శులుగా వరాల పరుశురాం, తూడి శ్రీనివాస్ రెడ్డి, నీలం సంపత్ రాజ్ లు ఎన్నిక అయ్యారు. కార్యవర్గం సభ్యులుగా పురుమాల్ల అంజయ్య, తూడి మోహన్ రెడ్డి, వేల్పుల నర్సింగరావు, ఊరడి రవీందర్, కొమ్ము రమేష్, బూరుగుపల్లి కిరణ్ కుమార్, కటకం జగదీశ్వర్, చవితి శశిధర్ రావులు ఎన్నికయారు.



## రైతులకు అగ్రి ఆప్ పై అవగాహన–రైతుల నుంచి ఆయిల్ ఫామ్ మొక్కల కొరకై డీడీ ల స్వీకరణ

**ప్రజాతీర్పు , 17 డిసెంబర్ 2024 మల్యాల వార్త**

**( రమేష్ వంగల - బ్యూరో చీఫ్ జగిత్యాల )**

మంగళవారం రోజున రైతు వేదిక మల్యాల నందు రైతు నేస్తం ప్రోగ్రాం లో భాగంగా ఎపిసోడ్ నెంబర్ - 37లో శాస్త్రవేత్తలచే రైతులకు యాసంగి పంటల్లో సస్యరక్షణ మరియు ఎన్ పి ఎస్ ఎస్ అనే అగ్రి ఆప్ గురించి రైతులందరికీ అవగాహన కల్పించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో జగిత్యాల జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ శాఖ అధికారి శ్రీ దేవ ప్రసాద్ మరియు మండల వ్యవసాయ అధికారి కే చంద్ర దీపక్ మరియు ఏఈవోలు మంజుల కారుణ్య , శ్రీనివాస్ రెడ్డి , శ్రీనివాస్ మరియు రైతులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం తర్వాత ముత్యంపేట గ్రామానికి చెందిన మ్యక లక్ష్మణ్ మరియు ఇతర రైతులు 30 ఎకరాలకు గాను ఆయిల్ ఫామ్ మొక్కల కోసం డీడీ లను వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జిల్లా ఉద్యానవన మరియు పట్టు పరిశ్రమ శాఖ అధికారి దేవా ప్రసాద్ గారికి అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమము లో ఉద్యానవన క్షేత్ర అధికారి నిమ్మ అనిల్ కుమార్ పాలగొన్నరు.



## వైద్యులు తిప్పని సుధాకర్ స్పష్టం చేశారు

ప్రజా వైద్యునిగా పేరుందిన డాక్టర్ అప్పని సుధాకర్ 25వ వర్ధంతి హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కూడలిలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ముల్కనూర్ నర్సింగ్ హోమ్ వైద్యులు తిప్పని సుధాకర్ ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రైవేటు వైద్యరంగంలో చేయబడినప్పటికీ స్వర్గీయ సుధాకర్ డాక్టర్ ప్రజా వైద్యు నీగా పేరుందారని ఆయన అన్నారు. ఆయన మేన అల్లుడైన తనకు ఆయన పేరు పెట్టడం నేను కూడా వైద్య వృత్తిలోనే కొనసాగడం తన పూర్వ జన్మ సుకృతం అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తపెల్లి మాజీ సర్పంచులు పత్తిపాక కొమురెల్లి, అప్పని ఉమాపతి, కొంగల రామచంద్ర రెడ్డి, చంద్రశేఖర్, మీసా మహేష్ ల్యాబ్ వెంకన్న తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా జాతీయ పెన్షనర్స్ దినోత్సవం

### 25 మంది రిటైర్డ్ ఉద్యోగులకు సన్మానం

**( వకుళాభరణం భానుప్రకాష్ కరీంనగర్ డిసెంబర్ 17 )**

జాతీయ పెన్షనర్స్ దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. రిటైర్డ్ ఉద్యోగుల సంఘ భవనంలో అధ్యక్షుడు మోసం అంజయ్య అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వివిధ ప్రభుత్వ శాఖలలో విశిష్ట సేవలు అందించి పదవీ విరమణ పొందిన 25 మంది రిటైర్డ్ ఉద్యోగులను ఘనంగా సన్మానించారు.పదవి విరమణ పొందిన ఉద్యోగులు తమకు తల్లిదండ్రులతో సమానమని,వారికి సేవ చేయడం భగవంతుడు ఇచ్చిన వరమని జిల్లా ట్రెజరీ అధికారి నాగరాజు అన్నారు. పదవీ విరమణ పొందిన ఉద్యోగుల సమస్యలనుసబ్ ట్రెజరీ అధికారి మంజుల నివృత్తి చేశారు. రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దామెర మహేందర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు పోరెడ్డి నరేందర్ రెడ్డి, కార్యదర్శులు రామచందర్రావు, లక్ష్మీనారాయణ, కోశాధికారి బి నరేందర్, సంఘం నాయకులు శ్రీధర్ రావు, శంషోద్దిన్, మల్లయ్య, రామచంద్రంతో పాటు పెద్ద సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు.



# పెన్షనర్ల హక్కుల పరిరక్షణకై చర్యలు.

## జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.

**(ప్రజాతీర్పు జిల్లాప్రతినిధి నిర్మల్ డిసెంబర్ 17)**



పెన్షనర్ల హక్కుల పరిరక్షణకు చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘ భవనంలో నిర్వహించిన జాతీయ పెన్షనర్ల దినోత్సవంలో ముఖ్యఅతిథిగా ఆమె పాల్గొన్నారు. ముందుగా కార్యక్రమానికి హాజరైన జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి రాధిక, డిటిఓ సరోజ లతో కలిసి కలెక్టర్ జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, పెన్షనర్ల హక్కులు, సంక్షేమానికి చర్యలు తీసుకుంటామని అన్నారు. నేటి జాతీయ పెన్షనర్ల దినోత్సవ కార్యక్రమానికి హాజరైన పెన్షనర్లందరికి పెన్షనర్స్ డే సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈరోజు మీరు అందించిన సేవలను గౌరవించుకోవడం, అనుభవాలను పంచుకోవడం కోసం ప్రత్యేకమైన రోజు అని తెలిపారు. మీరు చేసిన కృషి, నిబద్ధత, అంకితభావం ఫలితంగానే సమాజం ఈ స్థాయికి చేరుకుందని అన్నారు. జిల్లాకు ఎన్నో సంవత్సరాలుగా మీరు చేసిన సేవలు వెలకట్టలేనివన్నారు. సీనియర్ సిటిజన్ యాక్ట్ ద్వారా హక్కులు, రక్షణను పొందవచ్చు అని తెలిపారు. సంక్షేమ వసతి గృహాలను సందర్శించి విద్యార్థులకు మీ అనుభవాలను వివరిస్తూ వారిని ప్రయోజకులుగా తీర్చిదిద్దేలా మీ విలువైన సలహాలు, సూచనలు అందించాలని కోరారు. మీ హక్కుల రక్షణ, సమస్యల పరిష్కారానికి జిల్లా యంత్రాంగం ఎప్పుడు సిద్ధంగా ఉంటుందని ఈ సందర్భంగా కలెక్టర్ హామీ ఇచ్చారు. డిఎల్ఎస్ఏ కార్యదర్శి మాట్లాడుతూ, నేడు దేశవ్యాప్తంగా జాతీయ పెన్షనర్ల దినోత్సవం జరుపుకుంటున్నామని తెలిపారు. ప్రతి రిటైర్డ్ ఉద్యోగి పెన్షన్ తీసుకోవడం రాజ్యాంగం కల్పించిన హక్కు అని పెన్షన్ ఆర్థిక భద్రతనే కాకుండా జీవితానికి గౌరవాన్ని కలిగించేదని అన్నారు. నేటి సమాజంలో వయోవృద్ధులకు ఎదురైతున్న సమస్యల పరిష్కారానికి జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ తరపున చర్యలు తీసుకుంటామని తెలిపారు. మీ విలువైన సలహాలు, జీవితానుభవాలతో నేటి తరానికి మార్గ నిర్దేశం చేయాలని కోరారు. అంతకుముందు పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు ఎంసీ లింగన్న మాట్లాడుతూ, పెన్షనర్ల సంఘ భవనం కాంపౌండ్ వాల్ నిర్మాణానికి 5 లక్షలు జిల్లా కలెక్టర్ మంజూరు చేశారని తెలిపారు. సంఘం ఆధ్వర్యంలో పెన్షనర్ల సంక్షేమానికి పడుతున్న కార్యక్రమాలను వివరించారు. అనంతరం మున్సిపల్ కార్మికులను, విశ్రాంత ఉద్యోగులను కలెక్టర్, అధికారులు శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ రత్న కళ్యాణి, ఎస్టిఓ రమేష్, ఎంఆర్ఓ రాజు, సంఘం ప్రతినిధులు, అధికారులు, సిబ్బంది, విశ్రాంత ఉద్యోగులు, పాల్గొన్నారు.



## శీతాకాల విడిదికి హైదరాబాద్ చేరుకున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

### స్వాగతం పలికిన తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, మహిళ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, ప్రభుత్వ ప్రధాన సలహాదారు వేణుగోపాల్ రావు

**మేడ్చల్ జిల్లా ప్రజా తీర్పు ప్రతినిధి**

**(గడ్డం వినోద్ కుమార్ ):-**

భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శీతాకాల విడిదికై మంగళవారం సాయంత్రం ఇండియన్ ఎయిర్ ఫోర్స్ ప్రత్యేక విమానంలో మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా పరిధిలోని హకీంపేట విమానాశ్రయానికి చేరుకొన్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రత్యేక విమానంలో నుంచి దిగిన వెంటనే తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ,మహిళ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, ప్రభుత్వ ప్రధాన సలహాదారు వేణుగోపాల్ రావు, రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి శాంతకుమారి, రాష్ట్ర డీజీపీ జితేందర్, జిల్లా కలెక్టర్ గౌతం పొట్రు శాలువాలు, పుష్పగుచ్చాలతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక వాహనంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాష్ట్రపతి నిలయానికి బయలుదేరారు. ముందుగా విచ్చేసిన రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి లకు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరు గౌతం పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా , మేడ్చల్ డిసిపి కోటరెడ్డి, ఎసిపి రాములు, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు, ఆర్డిఓ సైదులు, తహసీల్దారు యాదగిరి రెడ్డి సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## గ్రామీణ స్థాయి నుండి జాతీయ, అంతర్జాతీయ స్థాయికి క్రీడాకారులు ఎదగడానికి సీఎం కప్ తోడ్పడుతుంది

### స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్.

**(ప్రజాతీర్పు జిల్లాప్రతినిధి నిర్మల్ డిసెంబర్ 17)**

గ్రామీణ స్థాయి నుండి జాతీయ, అంతర్జాతీయ స్థాయికి క్రీడాకారులు ఎదగడానికి సీఎం కప్ తోడ్పడు తుందని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అన్నారు.మంగళవారం నిర్మల్ స్పోర్ట్స్ అకాడమీ లో ప్రారంభించిన బ్యాడ్మింటన్ క్రీడా పోటీల ప్రారంభ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామ స్థాయి నుండి క్రీడాకారులు జాతీయ స్థాయి వెళ్లేలా సీఎం కప్ క్రీడా పోటీలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. యువత చదువుతోపాటు క్రీడలలో చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ క్రీడామైదానంలో రెండో రోజు క్రీడా పోటీలను జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి శ్రీకాంత్ రెడ్డి ప్రారంభించారు. బాక్సింగ్, హ్యాండ్ బాల్, నెట్ బాల్, చెస్, తైక్వాండో, కారాటే, ఆట్యా పాట్యా, ఎన్ఎస్ఏ అకాడమీలో బ్యాడ్మింటన్ క్రీడలు నిర్వహించారు. ఇందు లో జిల్లా వ్యాప్తంగా దాదాపు 800 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఒలంపిక్ అసోసియేషన్ కన్వీనర్ శ్రీధర్ రెడ్డి, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీ రవీందర్ గౌడ్, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం కార్యదర్శి భోజన్న, వ్యాయామ ఉపాధ్యాయులు భూమన్న, బుచ్చి రామారావు, రమణారావు, స్వామి, భూమేష్, జమున, విజయలక్ష్మి, రాజేందర్ ,కవిత, సంజీవ్, సాయిరాజ్ ముకేష్ తదితరులు, పాల్గొన్నారు.



## దిలావర్పూర్ కేజీబీవిని సందర్శించిన జిల్లా విద్యాధికారి

**(ప్రజాతీర్పు జిల్లాప్రతినిధి నిర్మల్ డిసెంబర్ 17)**

నిర్మల్ జిల్లా విద్యాధికారి రామారావు దిలావార్పూర్ లోని కేజీబీవీ పాఠశాలను మంగళవారం ఉదయం పూట పరిశీలించారు. సందర్భంగా ఆయన విద్యార్థుల హాజరుఉపాధ్యాయుల హాజరు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇద్దరు సిఆర్టి లు, ఇద్దరు పిజిసిఆర్టి లు, ఒక పిఈటి, ఒక ఏఎన్ఎం మొత్తం నాన్ టీచింగ్ సిబ్బంది అందరూ పాఠశాలలో హాజరయ్యారని ఆయన తెలియజేశారు. కామన్ డైట్ మెనూ యొక్క అమలును పరిశీలించారు తరగతుల నిర్వహణ, సరుకుల నిర్వహణ, భోజనం తయారీ మొదలగు అంశాలను పరిశీలించారు. అదేవిధంగా పదో తరగతి విద్యార్థులను కలిసి పరీక్షలపై మార్గ నిర్దేశం చేశారు. విద్యార్థులందరు కష్టపడి చదివి, 100% ఉత్తీర్ణత సాధించాలని తెలియజేశారు. పాఠశాల సిబ్బంది విద్యార్థుల ఆరోగ్యం పట్ల వారి భోజన ఏర్పాట్లు పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ, జాగ్రత్తగా ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కేజీబీవీ పాఠశాలల సమన్వయకర్త సలోమికరణ, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ పెన్షనర్స్ దినోత్సవం

**కరీంనగర్, డిసెంబర్, 17**

జాతీయ పెన్షనర్స్ దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. రిటైర్డ్ ఉద్యోగుల సంఘ భవనంలో అధ్యక్షుడు మోసం అంజయ్య అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా వివిధ ప్రభుత్వ శాఖలలో విశిష్ట సేవలు అందించి పదవీ విరమణ పొందిన 25 మంది రిటైర్డ్ ఉద్యోగులను ఘనంగా సన్మానించారు.పదవి విరమణ పొందిన ఉద్యోగులు తమకు తల్లిదండ్రులతో సమానమని,వారికి సేవ చేయడం భగవంతుడు ఇచ్చిన వరమని జిల్లా ట్రెజరీ అధికారి నాగరాజు అన్నారు. పదవీ విరమణ పొందిన ఉద్యోగుల సమస్యలనుసబ్ ట్రెజరీ అధికారి మంజుల నివృత్తి చేశారు.రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దామెర మహేందర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు పోరెడ్డి నరేందర్ రెడ్డి, కార్యదర్శులు రామచందర్రావు, లక్ష్మీనారాయణ, కోశాధికారి బి నరేందర్, సంఘం నాయకులు శ్రీధర్ రావు, శంషోద్దిన్, మల్లయ్య, రామచంద్రంతో పాటు పెద్ద సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు.



# ఆకాంక్షిత జిల్లా అభివృద్ధి లక్ష్యసాధనకు బ్యాంకర్లు సహకరించాలి

## డాక్టర్ ఏం పి తంగిరాల అడిషనల్ సెక్రటరీ డి ఎఫ్ ఎస్, జి ఓ ఐ.

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ప్రజా తీర్పు ప్రతినిధి ( సందీప్) డిసెంబర్ 17**






కొత్తగూడెం జిల్లా లో వివిధ ఆర్థిక మద్దతు పథకాల లక్ష్య సాధనకు రుణాల అందించడంలో అన్ని బ్యాంకులు సహకరించాలని డాక్టర్ ఏం పి తంగిరాల అడిషనల్ సెక్రటరీ డి ఎఫ్ ఎస్, జి ఓ ఐ అన్నారు. మంగళవారం ఐడిఓసి కార్యాలయం సమావేశ మందిరంలో నీతి అయోగ్ ఆకాంక్షిత జిల్లా కార్యక్రమం లో భాగంగా ప్రభుత్వ ప్రైవేటు బ్యాంకు అధికారులు జిల్లాలోని వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం జిల్లా కలెక్టర్ జితేష్ వి పార్టీలతో కలిసి నిర్వహించారు. సమీక్ష సమావేశంలో భాగంగా జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఆకాంక్షిత జిల్లా అభివృద్ధిలోభాగంగా విద్య, వైద్య ఆరోగ్యశాఖ, సంవర్ధక శాఖ, గ్రామీణాభివృద్ధి సంస్థ, వ్యవసాయ శాఖ తదితర శాఖలలో జిల్లాలో చేపడుతున్న అన్ని కార్యక్రమాలను శాఖల వారీగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కేంద్ర సభ్యులకు వివరించారు. జిల్లాలో నీటి కుంటలు, కెనాల్ బండ్ ప్లాంటేషన్, మునగ సాగు మరియు మట్టితో ఇటుకల తయారీ వంటి కార్యక్రమాల గురించి కలెక్టర్ సభ్యులకు వివరించారు. ఎస్ ఐ డి బి ఐ బ్యాంకు వారు ఎం ఎస్ ఎం ఈ లకు కంపారిజన్ బయో గ్యాస్ ప్లాంట్ కోసం కెనరా బ్యాంక్, తేనెటీగల పెంపకం, డ్రాగన్ ఫ్రూట్ సాగు, జీడి పంట వంటి పంటల విస్తరణ, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, చిన్న తరహా పరిశ్రమలు, కమ్యూనిటీ పశువుల షెడ్లు తదితర అభివృద్ధి పనులు చేపట్టడానికి సహాయ సహకారం అందించాలని అడిషనల్ సెక్రటరీ, డీఎఫ్ఓ వారిని కోరారు. ఆకాంక్షిత క్రమంలో భాగంగా ఏఎంసీ రిజిస్ట్రేషన్, ఆసుపత్రులలో డెలివరీ, ఇప్పుడే పుట్టిన శిశువులకు తల్లిపాలు తాగించడం వంటి తదితర అంశాలలో పురోగతిపై అడిషనల్ సెక్రటరీ అధికారులను అభినందించారు. అనంతరం డాక్టర్ ఏం పి తంగిరాల అడిషనల్ సెక్రటరీ డి ఎఫ్ ఎస్, జి ఓ ఐ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, పీఎం జనరల్ యోజన ముద్ర రుణాలు మంజూరు చేయాలన్నారు.జిల్లాలో ముద్ర లోన్ మంజూరు ఎందుకు తక్కువగా బ్యాంక్ అధికారులను అడిగారు. ఆర్థిక మద్దతు పథకాలకు సంబంధించి 100% లక్ష్యసాధనకు బ్యాంకర్లు ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. ఆకాంక్షిత జిల్లా అభివృద్ధిలో భాగంగా జిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, నిన్న తరహా పరిశ్రమలు స్థాపించాలని అన్నారు.ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకంలో భాగంగా జిల్లాలో ప్రధానమంత్రి సురక్ష యోజన, అటల్ పెన్షన్ యోజన, పిఎం జనధన్ యోజన పథకాలను పంచాయతీ సెక్రటరీలు అత్యధిక లక్ష సాధన చేసిన పదిమందికి జనవరి 26 రిపబ్లిక్ డే రోజున సన్మానం మరియు ప్రశంసా పత్రాలు అందజేపడతాయి అని జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, సిపిఓ సంజీవరావు, లీడ్ బ్యాంక్ మేనేజర్ రామ్ రెడ్డి, అన్ని బ్యాంకుల అధికారులు, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



# దళిత జర్నలిస్ట్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షులు కాశపోగు జాన్ జన్మదిన వేడుకలు

## వర్కింగ్ ప్రెసిడెంట్ రత్నకుమార్ ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ప్రజా తీర్పు ప్రతినిధి (సందీప్)డిసెంబర్ 17**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో దళిత జర్నలిస్ట్ ఫోరమ్ వ్యవస్థాపకులు కాశ పోగు జాన్ జన్మదిన వేడుకలు తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల దళిత జర్నలిస్టు ఫోరం వర్కింగ్ ప్రెసిడెంట్ రత్నకుమార్ జిల్లా అధ్యక్షులు ఈదునూరి బాలకృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా కొత్తగూడెం హెడ్ ఆఫీస్ ముందు ఎస్సీ, ఎస్టీ బీసీ మైనార్టీ కార్యాలయం లో కేక్ కటింగ్ చేసి అందరికీ స్వీట్లు అందజేసి ఘనంగా పుట్టినరోజు వేడుకలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వర్కింగ్ ప్రెసిడెంట్ రత్నకుమార్ మాట్లాడుతూ ప్రతీ జిల్లాలో అక్రిడేషన్ కమిటీలో స్థానం కల్పించాలని దళిత బంధు పేరుతో గత ప్రభుత్వం మోసం చేసిందని తెలంగాణ ప్రస్తుత రాష్ట్రంలో అంబేద్కర్ అభయా హస్తం ద్వారా 12 లక్షల రూపాయలు మొదటి విడతలో దళిత జర్నలిస్టులకు అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు మొదటిగా దళితులకే కేటాయించాలని దళితుల జర్నలిస్టుల హక్కుల కొరకు అనేక పోరాటాలు చేస్తున్న వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు జాన్ అన్న పుట్టినరోజు వేడుకలు కొత్తగూడెంలో నిర్వహించడం చాలా సంతోషంగా ఉందని ఈ సందర్భంగా బస్టాండ్ రైల్వే స్టేషన్లలో బీదవారికి యాచకులకు ఆహారం, త్రాగునీరు అందించడం జరిగింది .ఈ కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దళిత జర్నలిస్టు ఫోరం అధ్యక్షులు ఈదునూరి బాలకృష్ణ భూపేష్ గోపి రవీందర్ వినోద్ కిరణ్ తదితరులు పాల్గొని జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు.

# నిరంకుశ పాలనను నిరసిస్తూ అన్నదాతలకు మద్దతు

## డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పణ

**( ప్రజాతీర్పు ప్రతినిధి కోహెడ డిసెంబర్ 17 )**

లగచర్ల రైతులపై పెట్టిన అక్రమ కేసులను టిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కర్ర శ్రీహరి మండల శాఖ అధ్యక్షులు పెరుగు నరేందర్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. రైతులపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని వారు డిమాండ్ చేశారు. లగచర్ల రైతులపై అక్రమ కేసులు పెట్టడమే కాకుండా థర్డ్ డిగ్రీ ఉపయోగించి జైలులో పెట్టడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు మంగళవారం సిద్దిపేట జిల్లా కోహెడ మండలం కేంద్రంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల చేతులకు బేడీలు వేసిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎక్కడికక్కడ నిలదీయాలన్నారు. నిరంకుశ పాలనను నిరసిస్తూ ప్రజలంతా అన్నదాతలకు మద్దతు తెలుపాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అమానవీయ, అణచివేత ధోరణిని నిరసిస్తూ ప్రజలు రైతులకు మద్దతు తెలుపాలన్నారు. రైతులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేసి జైలులో నిర్బంధించిన రైతులను విడుదల చేసే వరకు పోరాటం చేయాలన్నారు. రైతు లేనిది రాజ్యం లేదన్నారు. రైతులకు బేడీలు వేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం తప్పదని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి పొన్నాల లక్ష్మణ్ సీనియర్ నాయకులు ఆవుల మహేందర్ తిప్పారపు శ్రీకాంత్ తిప్పారపు నాగరాజు యూత్ అధ్యక్షులు జాలిగం శంకర్ సోషల్ మీడియా కన్వీనర్ వజ్జపల్లి శ్రీనివాస్ మంద రాజయ్య గవ్వ కిషన్ రెడ్డి బద్దం తిరుపతిరెడ్డి అబ్దుల్ రహీం వేల్పుల నారాయణ మాజీ ఎంపీటీసీ సభ్యులు బాబయ్య గ్రామ శాఖ అధ్యక్షులు పొలావేణి కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు





# ప్రజల సమస్యల కోసమే.. పాదయాత్ర

**కూకట్పల్లి, డిసెంబర్ 17, (ప్రజాతీర్పు) :**

ప్రజా సమస్యల పరిష్కారం కోసం పాదయాత్ర చేపట్టామని, పాదయాత్రలో భాగంగా స్థానికులతో మాట్లాడుతూ అక్కడి సమస్యలను తెలుసుకొని, వాటి పరిష్కారం కోసం కృషి చేస్తామని పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. మంగళవారం హైదర్ నగర్ డివిజన్ పరిధిలోని భాగ్య నగర్ కాలనీలో గల పలు సమస్యలు, చేపట్టవలసిన పలు అభివృద్ధి పనులపై పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు, జిహెచ్ఎంసి, ఇంజనీరింగ్ విభాగం అధికారులతో కలిసి కాలనీలో పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా భాగ్య నగర్ కాలనీ వాసులు మాట్లాడుతూ కాలనీలో మౌలిక వసతులు కలిపించినదుకు కృతజ్ఞతలు తెలియజేశారు. అదేవిధంగా కాలనీలో డ్రైనేజి సమస్యను పరిష్కరించాలని, వరద నీటి కాల్వను నిర్మించాలని, కాలనీలో ట్రాఫిక్ ఇబ్బందులను పరిష్కరించాలని, మంచి నీటి వ్యవస్థను మెరుగు పర్చలని, ఎమ్మెల్యే గాంధీ దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం పీఏసీ చైర్మన్ గాంధీ మాట్లాడుతూ భాగ్య నగర్ కాలనీ వాసుల విజ్ఞప్తి మేరకు ఈ రోజు కాలనీలో పాదయాత్ర చేయడం జరిగినదన్నారు. భాగ్య నగర్ కాలనీలో అసంపూర్తిగా మిగిలిపోయిన రోడ్ల సమస్యను త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు. త్వరలనే సీసీ రోడ్డు ఏర్పాటు చేస్తామని, కాలనీలో అన్ని రకాల మౌలిక వసతులు కల్పించి, అసంపూర్తిగా మిగిలిపోయిన రోడ్లను అతి త్వరలో చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. వరద నీటి కాల్వ నిర్మాణం పనులు చేపడుతామని, కాలనీలో మంచి వాతావరణం కల్పిస్తామని, ప్రజలకు ఇబ్బంది లేకుండా సుఖవంతమైన ప్రయాణానికి బాటలు వేస్తామని తెలియజేశారు. అన్ని రోడ్లను దశల వారిగా చెప్పుటి పూర్తి స్థాయిలో రోడ్ల నిర్మాణం పనులు చేపట్టి, డ్రైనేజి వ్యవస్థను కూడా మెరుగుపరుస్తామని, వరద నీటి నిల్వ లేకుండా చూస్తామన్నారు. మంచి నీటి వ్యవస్థను మెరుగు పరుస్తామని తెలియచేసారు. అసంపూర్తిగా మిగిలి పోయిన రోడ్ల పనులు వెంటనే చేపట్టి ప్రజలకు ఉపశమనం కలిగేలా చూడలని అధికారులకు గాంధీ సూచించారు. ఏ చిన్న సమస్య వచ్చిన తన దృష్టికి తీసుకువస్తే తప్పకుండా పరిష్కరిస్తానని, ఎల్లవేళలో మీకు అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే గాంధీ ఈ సందర్భంగా ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి ఏఈ రాజీవ్, వర్క్ ఇన్స్పెక్టర్ మహాదేవ్, నాయకులు, కార్యకర్తలు, మహిళలు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ

**కూకట్పల్లి, డిసెంబర్ 17, (ప్రజాతీర్పు) :**

ముఖ్యమంత్రి సహాయనిది పేదలకు బాసటగా నిలుస్తుందని శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ వి.జగదీశ్వర్ గౌడ్ పేర్కొన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం కూకట్పల్లి డివిజన్ నిర్వాసితులు మధు గౌడ్ చికిత్స పొందిన అనంతరం శేరిలింగపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ కార్యాలయాన్ని సంప్రదించి, ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేశారు. ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన రూ. 52,500 చెక్కును మంగళవారం శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ వి.జగదీశ్వర్ గౌడ్ నియోజకవర్గ నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వర రావుతో కలిసి భాదిత కుటుంబ సభ్యులకు అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు, వివేకానంద నగర్ డివిజన్ అధ్యక్షులు బాష్పాక యాదగిరి, మల్లేష్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.





# కారు, బైక్ ఢీకొన్న ఘటనలో పలువురికి తీవ్ర గాయాలు

**ఎండపల్లి, డిసెంబర్ 17 : ( ప్రజా తీర్పు ప్రతినిధి )**

జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గం ఎండపల్లి మండలం సూరారం గ్రామ శివారు లో రోడ్డు ప్రమాదం జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం ఎదురెదురుగా వస్తున్న కారు,, బైక్ లు ఢీకొనడం వల్ల ప్రమాదం చోటుచేసుకుంది. ఈ సంఘటన లో పలువురికి తీవ్ర గాయాలు కాగా వారిని వెంటనే అంబులెన్స్ ద్వారా ఆసుపత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి, ప్రమాదానికి గల కారణాలను, గాయపడిన క్షతగాత్రుల పూర్తి వివరాలు సేకరిస్తున్నట్టు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



# కిరాణా దుకాణాలపై టాస్క్ ఫోర్స్, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో తనిఖీలు.


**భీమదేవరపల్లి, ప్రజా తీర్పు డిసెంబర్ 17**

భీమదేవరపల్లి మండలం, ముల్కనూర్ గ్రామంలో నిషేధిత పొగాకు ఉత్పత్తి గుట్కాలను విక్రయిస్తున్న కిరాణా దుకాణాలపై టాస్క్ ఫోర్స్, స్థానిక సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ సాయిబాబు, పోలీసు సిబ్బంది ఆధ్వర్యంలో మంగళవారం సోదాలు నిర్వహించారు. ఈ క్రమంలో ములకనూరు పట్టణానికి చెందిన (బీ.వీ.డీ) కిరాణా షాపు యజమాని బల్లు రమేష్ కిరాణా షాపులో 42,800 రూపాయల విలువ గల పొగాకు, గుట్కా ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఇదే గ్రామానికి చెందిన తిరుమల కిరాణం యజమాని శనిగరపు వేణు కిరాణా షాపులో 33,500 రూపాయల విలువ గల పొగాకు, గుట్కా ఉత్పత్తులు స్వాధీనం చేసుకున్నారు. వీరిద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.ఇకపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిషేధించబడిన పొగకు ఉత్పత్తులను అమ్మకాలు, కొనుగోలు చేసిన వారిపై చట్టరిత్య కఠిన చర్యలు తీసుకుంటామని, మండలంలో నిషేధిత పొగకు ఉత్పత్తులను ఎవరైనా చేసినచో తమకు సమాచారం అందించవలసిందిగా ముల్కనూర్ ఎస్సై సాయిబాబు తెలిపారు.

# రైతు చేతికి బేడీలు వేసి జైలుకు పంపిన ఘనత కాంగ్రెస్ పార్టీది

**ఎండపల్లి,డిసెంబర్ 17( ప్రజా తీర్పు ప్రతినిధి)**


రైతు చేతికి బేడీలు వేసి జైల్లో తోసిన ఘనత రాష్ట్ర చరిత్రలోనే కాంగ్రెస్ పార్టీకి దక్కిందని భారాస పార్టీ ఎండపల్లి మండల అధ్యక్షుడు సింహాచలం జగన్ అన్నారు. బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఆదేశాలతో,మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పిలుపు మేరకు ఈరోజు ఎండపల్లి మండలం సూరారం గ్రామంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న రైతుల అక్రమ ఆరెస్ట్ లకు నిరసనగా భారత రాజ్యాంగ నిర్మాత డా: బి ఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందించారు.ఈ సందర్భంగా సింహాచలం జగన్ మాట్లాడుతూ. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు మరిచి, తరతరాలు గా సాగు చేస్తున్న ధళిత, గిరిజనుల భూములు స్వాధీనం చేసు కోవడం అక్రమమని, అత్యంత అమానుషమైన చర్యగా భావిస్తూ, లగచర్ల లో పేద రైతుల భూములను లాక్కొవద్దని, రైతుల అబీష్టం మేరకే నడుచుకొనే విధంగా కాంగ్రెస్ పార్టీ నాయకులకు జ్ఞానోదయం కల్పించాలని, అలాగే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చే దిశగా ఆలోచించే సద్బుద్ధిని కాంగ్రెస్ ప్రభుత్వానికి కలిగించాలని డా. బి ఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు ఉప్పు రాజయ్య, ఉప్కమల్ల పరంధాములు, పడిదం వెంకటేష్, గంధం రవి, వెతుకు స్వామి లతోపాటు నాయకులు, కార్యకర్తలు గాజుల మల్లేశం, గంగాధరి రాజేశం, అరికిల్ల మహేందర్, కొమ్ము సంజీవ్ , అల్లంల శేఖర్, ఇప్పల రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.





## 6 శాతం కేసుల్లోనే ఛార్జిషీట్

న్యూఢిల్లీ : మణిపూర్ హింసాకాండకు సంబంధించిన కేసుల విచారణ నత్తనడకన సాగుతోంది. ఈ కేసుల దర్యాప్తు కోసం సుప్రీంకోర్టు నియమించిన 42 ప్రత్యేక విచారణ బృందాలు (సిట్) కేవలం 6 శాతం కేసుల్లోనే ఛార్జిషీట్ దాఖలు చేశాయి. హత్య, అత్యాచారం, మహిళలపై లైంగిక నేరాలు, దగ్ధం, దోపీడీ, ఇతర హేయమైన చర్యలతో మొత్తం 3,023 కేసులు నమోదు కాగా, వీటిలో 192 కేసుల్లోనే ఇప్పటి వరకూ ఛార్జిషీట్లు దాఖలు కావడం ఆందోళన కలిగిస్తోంది. కేసుల విచారణ ప్రారంభమైందా? లేదా? అనే విషయం కూడా స్పష్టంగా తెలియడం లేదు. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఇద్దరు కుకీ జో మహిళలపై లైంగిక వేధింపులు, నగంగా ఊరేగించిన కేసు విచారణ ఇంకా ప్రారంభం కాకపోవడం ఆందోళన కలిగిస్తోంది. 2023 మే 4న ఈ ఘటన జరిగితే వీడియో వైరల్‌గా మారిన రెండు నెలల తరువాత రాష్ట్ర పోలీసులు కేసు నమోదు చేశారు. తరువాత సిబిఐకి అప్పగించారు. ఈ కేసులో ఒక బాలుడుసహా ఆరుగురు నిందితులపై ఛార్జిషీట్ నమోదు చేసి గౌహతిలోని కోర్టులో గత ఏడాది జులైలో సిబిఐ దాఖలు చేసింది. అయినా ఇంకా విచారణ ప్రారంభం కాలేదు. గత ఏడాది ఆగస్టులో దేశవ్యాప్తంగా ఉన్న పోలీసు అధికారులను రప్పించి ఈ సిట్లను ఏర్పాటు చేశారు. ఈ ఏడాది నవంబర్ 20 వరకూ 574 నిందితులపై ఛార్జిషీటు దాఖలు చేశాయి. 384 మందిని అరెస్టు చేశాయి. భద్రతా దళాల నుంచి దోచుకున్న 501 ఆయుధాలను, 13,464 మందుగుండు సామాగ్రిని సిట్‌లు స్వాధీనం చేసుకున్నాయి. ఈ సిట్లను సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం ఆరు గ్రూపులుగా విభజించారు. హత్యలు, తీవ్రమైన నేరాల కేసుల విచారణకు సంబంధించి ఒక గ్రూపును, మహిళలపై అత్యాచారాలు, వేధింపుల కేసుల విచారణకు ఒక గ్రూపును ఏర్పాటు చేశారు. ఆస్థుల దగ్ధం, లూటీలు, ఇతర నేరాలకు మరో నాలుగు గ్రూపులను ఏర్పాటు చేశారు.



## జమిలిపై ఫైర్

న్యూఢిల్లీ : ఫెడరలిజంతో సహా రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని దెబ్బతీసే 'ఒకే దేశం, ఒకే ఎన్నికలు' లక్ష్యంగా రూపొందించిన వివాదాస్పద రాజ్యాంగ సవరణ బిల్లును ప్రతిపక్ష పార్టీలు ముక్తకంఠంతో వ్యతిరేకించాయి. ఈ బిల్లు రాజ్యాంగానికి వ్యతిరేకం గా ఉందని, ప్రజాస్వామ్య స్వరూపంపైన, సమాఖ్య వాదంపైన దాడిగా దీనిని అభివర్ణించాయి. రాష్ట్ర అసెంబ్లీ పదవీకాలాన్ని కేంద్ర పదవీకాలంలోకి ఎలా మార్చుతారని ప్రశ్నించాయి. అలా మార్చడం రాజ్యాంగానికి ద్రోహం చేయడమేనని విమర్శిం చాయి. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలను ఒకేసారి నిర్వహించేందుకు ఉద్దేశించిన 129వ రాజ్యాంగ సవరణ బిల్లు, అలాగే లోక్‌సభ ఎన్నికలతో పాటు కేంద్ర పాలిత ప్రాంతాలకు కూడా ఎన్నికలు నిర్వహించేందుకు కేంద్ర పాలిత ప్రాంతాల చట్ట సవరణ బిల్లును కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ మంగళవారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ఈ బిల్లు ప్రవేశపెట్టడాన్ని ప్రతి పక్షాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. ప్రవేశపెట్ట డాన్ని వ్యతిరేకిస్తూ ఓటింగ్ కోరాయి. ఈ ఓటింగ్‌లో 269 మంది సభ్యులు రాజ్యాంగ సవరణ బిల్లును సమర్పిం చడానికి మద్దతు ఇచ్చారు. దీనికి మూడింట రెండొంతుల మెజారిటీ అవసరం. 198 మంది సభ్యులు బిల్లును ప్రవేశపెట్టడాన్ని వ్యతిరేకించారు. ప్రజెంటేషన్ దశలోనే తీవ్ర వ్యతిరేకత రావడంతో, వివాదాస్పద బిల్లులను సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జెపిసి)కి పంపనున్నట్లు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. నిబంధనల మేరకు తీర్మానం తీసుకురా నున్నట్లు మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ తెలిపారు. మనీష్ తివారీ, గౌరవ్ గొగొరు (కాంగ్రెస్), అమ్రారామ్ (సిపిఎం), ధర్మేంద్ర యాదవ్ (ఎస్‌పి), టిఆర్ బాలు (డిఎంకె), కల్యాణ్ బెనర్జీ (టిఎంసి), సుప్రియా సూలే (ఎన్‌సిపి), అనిల్ దేశారు (శివసేన ఠాక్రే), మహ్మద్ బషీర్ (ఐయుఎంఎల్), అసదుద్దీన్ ఒవైసీ (ఎంఐఎం), ఎన్‌కె ప్రేమ్‌చంద్రన్ (ఆర్‌ఎస్‌పి) వంటి ప్రతిపక్ష ఎంపిలు తీవ్రంగా వ్యతిరేకించారు. టిడిపి, శివసేన షిండే వర్గం బిల్లుకు మద్దతు పలికాయి. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు, పెమ్మసాని చంద్రశేఖర్ (టిడిపి), శ్రీకాంత్ ఏక్‌నాథ్ షిండే (శివసేన షిండే) బిల్లుకు మద్దతు తెలుపుతూ మాట్లాడారు.ఎన్‌డిఎ ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న జెడియు నుంచి ఎవరూ బిల్లుకు మద్దతుగా మాట్లాడలేదు. 'ఒకే దేశం, ఒకే ఎన్నికలు' అనే భావన రాజ్యాంగంలోని ఫెడరలిజంతో సహా ప్రాథమిక సూత్రాలకు విరుద్ధమని ప్రతిపక్ష సభ్యులు విమర్శించారు. 'బిల్లులోని నిబంధనలు శాసన వ్యవస్థ అధికార పరిధిని ఉల్లంఘించేవిగా ఉన్నాయన్నారు. లోక్‌సభ పదవీకాలం ప్రకారం శాసన సభల పదవీకాలం నిర్ణయించబడదు. చట్టసభలు విడివిడిగా ఉంటాయి. ఈ బిల్లుతో అధిక కేంద్రీకరణ అమలులోకి వస్తుంది. సభల కాలవ్యవధి, ఎన్నికలు ఎప్పుడు నిర్వహించాలనే అధికారాలను ఎన్నికల కమిషన్‌కే వదిలేస్తున్నారు. అలా అయితే ఒక వ్యక్తి కోరిక నెరవేర్చడం కోసమే ఈ బిల్లులను పెట్టినట్లు ఉంటుంది' అని ప్రతిపక్ష ఎంపీలు విమర్శించారు. సమగ్ర అధ్యయనం, విస్తృత చర్చల తర్వాతే బిల్లు తీసుకొచ్చామని మంత్రి అర్జున్ రామ్ మేఘ్నవాల్ తెలిపారు. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలో ప్రభుత్వం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసిందని చెప్పారు. కమిటీ రాజకీయ పార్టీల అభిప్రాయాలను కూడా కోరిందని, 31 పార్టీలు అనుకూలంగా నిలిచాయని, 15 పార్టీలు వ్యతిరేకిస్తున్నాయని తెలిపారు.బిల్లులు కేబినెట్ పరిశీలనకు వచ్చినప్పుడే దీనిని జెపిసి పరిశీలనకు వదిలేయాలని ప్రధాని చెప్పారని హోం మంత్రి అమిత్ షా సెలవిచ్చారు. సిపిఎం ఎంపి అమ్రారామ్ మాట్లాడుతూ ఈ బిల్లును తమ పార్టీ వ్యతిరేకిస్తుందని స్పష్టం చేశారు. ఈ బిల్లుతో దేశ గణతంత్ర రాజ్యాన్ని ఖూనీ చేస్తున్నారని విమర్శించారు. గ్రామ పంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్, మున్సిపాలిటీ%ా% రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించినవని, కానీ ఈ బిల్లుతో ఇవన్నీ కేంద్ర ప్రభుత్వ పెత్తనం కిందికి వెళ్లిపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో ఒక్కో రాష్ట్రం ఒక్కో రకమైన భాష, తమదైన అధికార వికేంద్రీకరణ కలిగి ఉన్నాయని, వాటిపై రాష్ట్రాలకు గల హక్కును కేంద్రం ఎలా లాక్కొంటుందని విమర్శించారు. కేవలం పాసిస్ట్ అజెండాలో భాగంగానే ఈ బిల్లును తీసుకొస్తున్నారని విమర్శించారు.



# కనీస మద్దతు ధరకు చట్టబద్ధత

## రుణ మాఫీ కోసం పథకం

## వ్యవసాయ కార్మికుల కోసం జాతీయ కమిషన్

న్యూఢిల్లీ : పంటలకు అందిస్తున్న కనీస మద్దతు ధరలకు (ఎంఎస్‌పి) చట్టబద్ధత కల్పించి అమలు చేయాలని వ్యవసాయం, పశుసంవర్ధకం, ఫుడ్ ప్రాసెసింగ్‌పై ఏర్పాటు చేసిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ మంగళవారం కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేసింది. కనీస మద్దతు ధరలకు చట్టబద్ధత కల్పించాలని అన్నదాతలు, పలు రైతు సంఘాలు చాలా కాలం నుంచి డిమాండ్ చేస్తున్న విషయం తెలిసిందే. ఎంఎస్‌పిలకు చట్టబద్ధత కోరుతూ శంభు, ఖనౌరీ సరిహద్దుల వద్ద రైతులు ఆందోళన నిర్వహిస్తున్న సమయంలో పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఈ సిఫారసు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. పంజాబ్ మాజీ ముఖ్యమంత్రి, జలంధర్ ఎంపీ చరణ్‌జిత్ సింగ్ చెన్నీ నేతృత్వంలోని కమిటీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి వ్యవసాయం, రైతుల సంక్షేమానికి సంబంధించిన గ్రాంట్ల డిమాండ్లపై లోక్‌సభకు తన తొలి నివేదికను అందజేసింది. ఎంఎస్‌పిలకు చట్టబద్ధత కల్పించాలన్న సిఫార్సును తన నివేదికలో కమిటీ చేర్చిందని లోక్‌సభ సచివాలయం ఓ ప్రకటనలో తెలిపింది. 'దేశంలో వ్యవసాయ సంస్కరణలు, రైతుల సంక్షేమం కేంద్రంగా జరుగుతున్న చర్చలో ఎంఎస్‌పీల అమలు కేంద్ర బిందువుగా ఉన్నదని కమిటీ అభిప్రాయపడింది. ఎంఎస్‌పిలకు చట్టబద్ధత కల్పిస్తే దేశంలో రైతుల ఆత్మహత్యలను తగ్గించవచ్చునని పేర్కొంది. రైతులకు ఆర్థిక స్థిరత్వాన్ని కల్పించడం, మార్కెట్‌లో నెలకొంటున్న అస్థిర పరిస్థితుల నుండి వారికి రక్షణ కల్పించడం, రుణ భారాన్ని తగ్గించడం ద్వారా ఆత్మహత్యల నుండి రైతులను కాపాడవచ్చు. ఈ అంశాలను దృష్టిలో పెట్టుకొని ఎంఎస్‌పిలకు చట్టబద్ధత కల్పించాలని కమిటీ సిఫారసు చేసింది' అని లోక్‌సభ సచివాలయం ఆ ప్రకటనలో వివరించింది. రైతుల ఇక్కట్లకు, ఆత్మహత్యలకు రుణభారమే కారణమని అభిప్రాయపడిన కమిటీ%ా% అన్నదాతలు, వ్యవసాయ కార్మికుల రుణాలను మాఫీ చేసేందుకు ఓ పథకాన్ని ప్రవేశపెట్టాలని కేంద్రానికి సూచించింది. 2021-22, 2024-25 మధ్యకాలంలో వ్యవసాయం, రైతుల సంక్షేమ శాఖకు అధిక కేటాయింపులు జరిపినప్పటికీ కేంద్ర ప్రణాళికా వ్యయంలో ఈ శాఖ వాటా 3.53 శాతం (2020-21) నుండి 2.54 శాతానికి (2024-25) తగ్గిపోయిందని కమిటీ అందజేసిన గణాంకాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో ఉత్పాదకతను మెరుగుపరచడానికి వ్యవసాయానికి బడ్జెట్ కేటాయింపులు పెంచాలని కేంద్రాన్ని కమిటీ కోరింది. పిఎం -కిసాన్ పథకానికి అందిస్తున్న వార్షిక మద్దతును రూ.6,000 నుండి రూ.12,000కు పెంచాలని కూడా సిఫారసు చేసింది. వ్యవసాయ కార్మికులకు కనీస వేతనాలు అందేలా చూడడానికి సాధ్యమైనంత త్వరగా జాతీయ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని, దీనివల్ల వారికి లభించాల్సిన హక్కులు దక్కుతాయని కమిటీ తెలిపింది.

**జీవన వ్యయానికి అనుగుణంగా లేని 'ఉపాధి' వేతనాలు**

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజిఎన్ఆర్ఇజిఎ) వేతనాలు పెరుగుతున్న జీవన వ్యయానికి అనుగుణంగా లేవని పార్లమెంటరీ ప్యానెల్ తెలిపింది. ఎంజిఎన్ఆర్ఇజిఎపై ఏర్పాటు చేసిన పార్లమెంటరీ ప్యానెల్ మంగళవారం తన నివేదికను పార్లమెంట్ ఉభయ సభల్లో సమర్పించింది. ఈ పథకం కింద 2008 నుంచి చెల్లిస్తున్న వేతనాలపై ప్యానెల్ అధ్యయనం చేసింది. ఎంజిఎన్ఆర్ఇజిఎ పనులను కార్మికుల 'చివరి ప్రయత్నం', ఫాల్ బ్యాక్ ఎంపిక అని గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ పేర్కొనడాన్ని ప్యానెల్ ఖండించింది. 'ఇలాంటి పేర్లతో తక్కువ వేతనాలు, ఆలస్యంగా చెల్లింపులు చేయడం కార్మికుల్ని నిరుత్సాహ పరుస్తుంది. మెరుగైన వేతనాలు ఇచ్చే ప్రాంతాలకు వలస, పనికోసం వెళ్లడానికి ప్రేరేపిస్తుంది' అని ప్యానెల్ పేర్కొంది. ఉపాధి వేతనాల స్థిరీకరణ కోసం ఇప్పటి వరకూ బేస్ రేట్‌ను సవరించలేదని ప్యానెల్ విమర్శించింది. వినియోగదారుల ధరల సూచిక (సిపిఐ-ఎఎల్) ఆధారంగా బేస్ రేట్‌కు ఇంక్రిమెంటల్ విలువను జోడించాలని పేర్కొంది. బేస్‌రేటును సవరించడంపై అడిగిన ప్రశ్నకు గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ నుంచి నిర్దిష్ట ప్రతిస్పందన లేదా సిఫారసు లేకపోవడాన్ని ప్యానెల్ తప్పుపట్టింది. 'ఇటువంటి ముఖ్యమైన సిఫార్సుపై మౌనంగా ఉండటం, నిర్దిష్ట సమాధానం ఇవ్వకుండా దాటవేయడం 'ఉపాధి హామీ' మెరుగుదల కోసం నిర్వహిస్తున్న నిరంతర ప్రయత్నాలను బలహీనపరుస్తుంది' అని ప్యానెల్ పేర్కొంది.

## 13 పట్టణాలలో 10 డిగ్రీల కంటే తక్కువ ఉష్ణోగ్రత

న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా చలితీవ్రత పెరిగింది. రాజధాని ఢిల్లీ సహా పలు రాష్ట్రాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. కొన్ని ప్రాంతాలలో ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్‌లకు పడిపో యాయి. ఒడిశాలోని 13 పట్టణాలలో 10డిగ్రీల సెల్సియస్ కంటే తక్కువ ఉష్ణోగ్రత నమోదైనట్లు వాతావరణ శాఖ తెలిపింది. 4.7 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతతో కంధమాల్ జిల్లాలోని జి.ఉదయగిరి రాష్ట్రంలోనే అత్యంత శీతల ప్రదేశంగా రికార్డయినట్లు వెల్లడించింది. రూర్కెలాలో కనిష్ట ఉష్ణోగ్రత 5.7 డిగ్రీల సెల్సియస్, కోరాపుట్ జిల్లాలోని సిమిలిగూడలో 7.2 డిగ్రీల సెల్సియస్ నమోదు కాగా, వరుసగా పుల్బానిలో 7.5, సుందర్‌ఘర్‌లో 8.6, కియోంజర్ 8.9, అంగుల్, భవానీపట్న, కిరే, చిప్లియా మరియు నబరంగ్‌పూర్‌లలో 9 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. అలాగే జంటనగరాలైన భువనేశ్వర్, కటక్‌లలో వరుసగా 13.6 డిగ్రీల సెల్సియస్, 12.5 డిగ్రీల సెల్సియస్ కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.



## విమానాల్లో నకిలీ బాంబు బెదిరింపులకు కోటీ వరకు జరిమానా

### కేంద్రం కొత్త నిబంధనలు

న్యూఢిల్లీ :విమానాల్లో బాంబులున్నాయం టూ తప్పుడు సమాచారం వ్యాప్తి చేస్తున్న వారికి కోటి రూపాయల వరకూ జరిమానా విధించేలా ఎయిర్ క్రాఫ్ట్ (సెక్యూరిటీ) రూల్స్ 2023ను కేంద్రం సవరించింది. ఎయిర్ కాఫ్ట్, ఏరో డ్రోమ్, పౌరవిమానం భద్రత, రక్షణకు హాని కలిగించే విధంగా తప్పుడు సమాచారాన్ని సృష్టించడం, వ్యాప్తి చేయడం శిక్షార్హమైన నేరంగా పేర్కొంది. కొత్తగా పొందుపర్చిన నిబంధన 29ఎ ప్రకారం, ఇలాంటి వ్యక్తులకు లేదా సమూహాలకు విమాన ప్రయాణం నిషేధం విధించే అధికారాన్ని డైరక్టర్ జనరల్‌కు అప్పగిస్తూ ఈ నెల 16న కేంద పౌరవిమానయాన మంత్రిత్వ శాఖ ఒక గెజిట్ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. పార్లమెంట్‌లో పౌర విమానయాన మంత్రిత్వ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం ఈ ఏడాది జనవరి 1 నుంచి నవంబర్ 14 వరకూ విమానయాన సంస్థలకు 999 నకిలీ బాంబు బెదిరింపులు రాగా, అక్టోబర్ నెలలోనే 666 బెదిరింపులు వచ్చాయి. ప్రస్తుత నిబంధనల నేపథ్యంలో ఇప్పటి వరకూ ఇద్దరినే అదుపులోకి తీసుకోగలిగామని పోలీసులు వివరణ ఇస్తున్నారు.

## రిక్రూట్‌మెంట్ పరీక్షలు ఇక ఎన్‌టిఎ నిర్వహించదు

### కేంద్ర మంత్రి ప్రధాన్ వెల్లడి

న్యూఢిల్లీ : కొత్త సంవత్సరం నుండి ఇక ఎటువంటి రిక్రూట్‌మెంట్ పరీక్షలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) నిర్వహించబోదని కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ప్రకటించారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఉన్నత విద్యకు సంబంధించిన ప్రవేశ పరీక్షలపై మాత్రమే దృష్టి కేంద్రీకరిస్తుందని స్పష్టం చేశారు. మెడికల్ ఎంట్రెన్స్ నీట్ పరీక్షా పత్రం లీక్, అలాగే మరి కొన్ని ప్రశ్నాపత్రాల లీక్‌లతో పలు పరీక్షలు రద్దయిన వైనం పెద్దయెత్తున విమర్శలకు దారి తీసింది. దీంతో ఈ ఏడాది ప్రారంభంలో ఏర్పాటుచేసిన ఉన్నత స్థాయి కమిటీ సిఫార్సుల మేరకు పరీక్షల సంస్కరణలు తీసుకొచ్చామని మంత్రి తెలిపారు. సాంప్రదాయపద్ధతిలో పెన్ను, పేపర్‌తో నిర్వహించాలా? లేక కంప్యూటర్‌తో పరీక్ష నిర్వహించాలా? అనే విషయమై ఆరోగ్య మంత్రిత్వశాఖతో విద్యా శాఖ చర్చలు జరుపుతోంది. కామన్ యూనివర్శిటీ ఎంట్రన్స్ టెస్ట్ (సియుఇటి) %-% యుజి ని ఏడాదికి ఒకసారి మాత్రమే నిర్వహిస్తామని మంత్రి వెల్లడించారు. సమీప భవిష్యత్తులో కంప్యూటర్ సహాయంతో, సాంకేతిక ఆధారిత ప్రవేశపరీక్షలకు మారాలని ప్రభుత్వం యోచిస్తోందని చెప్పారు. కొత్త సంవత్సరంలో ఎన్‌టిఎను పునర్వవ్యస్థీకరించనున్నట్లు మంత్రి తెలిపారు. కనీసం పది కొత్త పదవులను ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు చెప్పారు. ఇంకా పనితీరులో కూడా చాలా మార్పులు వస్తాయన్నారు. ఎలాంటి పొరపాట్లకు తావులేని రీతిలో పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు.

# ఓవర్ స్టాకింగ్ వార్నింగ్!

పరిచయం లేనివాళ్లు ఇంటికొస్తే.. గడప బయటే నిలబెట్టి మాట్లాడి పంపించేస్తాం. మాట కలపడానికి ప్రయత్నిస్తే.. సున్నితంగా తిరస్కరిస్తాం. కానీ, నెట్టింట్లో మాత్రం దీనికి భిన్నంగా వ్యవహరిస్తున్నాం. హద్దూ, అదుపూ లేకుండా ఇంటి గుట్టంతా రట్టు చేస్తున్నాం. గుర్తు తెలియని వ్యక్తులను గడప దగ్గరే నిలబెట్టి శల్యపరీక్ష చేసే మనం.. సామాజిక మాధ్యమాల్లో మాత్రం అపరిచితులతో అపరిమిత స్నేహాన్ని కొనసాగిస్తున్నాం. అనవసరమైన విషయాలను పంచుకుంటున్నాం. దీన్నే ఓవర్ షేరింగ్ అంటారు. మీరు కూడా ఈ తరహా వ్యకులు సైబర్ స్టాకింగ్ బారినపడే ప్రమాదం ఉంది! వ్యక్తిగత సమాచారాన్ని విచ్చలవిడిగా ఆన్‌లైన్‌లో పంచుకోవడమే ఓవర్ షేరింగ్. గతంలో కేవలం ఒకటి రెండు ఫొటోలు, నాలుగు లైన్ల సమాచారం మాత్రమే సోషల్ మీడియాలో పోస్టు చేసేవారు. ఎప్పుడైతే వీడియోలు, చానల్స్ రూపంలో కంటెంట్‌ని షేర్ చేసుకునే వెసులుబాటు వచ్చిందో.. అప్పటి నుంచి ఇక్కట్లు మొదలయ్యాయి. నెటిజన్లు కూడా అత్యుత్సాహంతో కుటుంబ సభ్యులతో గడిపే ప్రైవేట్ మూమెంట్స్ కూడా షేర్ చేస్తున్నారు. ఏదైనా టూర్‌కు వెళ్తే.. ప్రయాణ విశేషాలను పూసగుచ్చినట్టు ఆన్‌లైన్‌లో పంచుకుంటున్నారు. ఫలానా ఊరికి బయల్దేరాం, ఈ హొటల్‌లో దిగాం.. ఇలా అన్నీ షేర్ చేస్తున్నారు. ఎక్కడికి వెళ్లినా, సందర్భశుద్ధి లేకుండా లైవ్ స్ట్రీమింగ్ పెట్టేస్తున్నారు. లైకులు, షేర్ల మోజులో ఇల్లంతా చక్కర్లు కొడుతూ వీడియోలు చేస్తున్నారు. లైక్స్, కామెంట్స్ చూసుకొని మురిసిపోతున్నారు. ఇదంతా 'ఓవర్ షేరింగ్' కిందికే వస్తుంది. దాని వెనకే 'సైబర్ స్టాకింగ్' ప్రమాదాన్ని విస్మరిస్తున్నారు.



**ట్రాకర్స్ ఉన్నారు జాగ్రత్త**

సోషల్ ఇన్‌ఫ్లూయెన్సర్ అవ్వాలనో.. ఇమేజ్‌ని పెంచుకోవాలని కొందరు వీడియోలు, ఫొటోలు షేర్ చేస్తూ ఉంటారు. వాళ్ల వీడియోలకు ఫ్యాన్స్ ఎలా ఉంటారో.. అలాగే నిత్యం ట్రాక్ చేస్తూ.. సైబర్ స్టాకింగ్ కోసం మరికొందరు సిద్ధంగా ఉంటారు. అంటే.. డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లలో పోస్టులను జల్లెడ పడుతూ.. ఎవరు ఎక్కడ తమ చేతికి చిక్కుతారా?' అని వెదుకుతుంటారు. ఈ స్టాకర్లు ఫేక్ ప్రొఫైల్‌తో సోషల్ మీడియా నెట్‌వర్క్‌లలోకి చొరబడతారు. లైక్ కొడతారు.. కామెంట్స్ పెడతారు. డిజిటల్ ఫ్రెండ్ అయ్యాక మీతో చాటింగ్ చేస్తారు. మీ పోస్టుల ఆధారంగానే మీ సమగ్ర సమాచారం పొందుతారు. కావాల్సిన విషయాలన్నీ రాబట్టిన తర్వాత సైబర్ స్టాకింగ్ మొదలు పెడతారు. ఉదాహరణకు ఒక అమ్మాయి ఏ టూర్‌కో వెళ్లిందని పోస్టు చేసిందనుకుందాం! ఈ స్టాకర్లు కూడా ఆమెను ఫాలో అవుతారు. రహస్యంగా ఆమె వ్యక్తిగత విషయాల్ని రికార్డు చేస్తారు. ఒకవేళ అది ప్రైవేట్ టూర్ అయితే వాళ్లు తీసిన వీడియోలు చూపించి ఆమెను బెదిరిస్తారు. చెప్పినట్టు వినకపోతే ఆ వీడియోలను ఆన్‌లైన్‌లో వైరల్ చేస్తామని బెదిరిస్తారు. వారికి కావాల్సింది తీసుకుంటారు. ఈ మోసాలకు తట్టుకోలేక కొందరు ఆత్మహత్య చేసుకున్న సందర్భాలూ ఉన్నాయి.

**ఈ జాగ్రత్తలు తప్పనిసరి**

సోషల్ మీడియాలో మీ ఆసక్తులు షేర్ చేయాలే కానీ, వ్యక్తిగత సమచారాన్ని కాదని గుర్తుంచుకోండి. మీ స్క్రీన్‌నేమ్ జెండర్‌ని స్పష్టంగా చెప్పేలా ఉండొద్దు. జెండర్–న్యూట్రల్ స్క్రీన్‌నేమ్ ఉపయోగించడం మంచిది. ట్యాగ్ అవకాశం కేవలం ఫ్రెండ్స్ లిస్ట్‌కి మాత్రమే పరిమితం చేయండి.ఎప్పటికప్పుడు అకౌంట్స్‌ని లాగాఫ్ చేయండి. నిత్యం బ్రౌజర్‌లో లాగిన్ అయి ఉండటం మంచిది కాదు.పబ్లిక్ కంప్యూటర్లలో సోషల్ మీడియా అకౌంట్‌లను ఓపెన్ చేయొద్దు.సోషల్ మీడియాలో ఫ్రెండ్ రిక్వెస్ట్ యాక్సెప్ట్ చేసేముందు.. ఆయా కాంటాక్ట్‌ల గురించి సెర్చ్ చేయండి. దీంతో ఫేక్ ప్రొఫైల్స్‌ను కనిపొట్టొచ్చు.సోషల్ మీడియా అకౌంట్‌కు క్లిష్టమైన పాస్‌వర్డ్ ఉండేలా మార్చుకోండి. టూ–ఫ్యాక్టర్ అథెంటికేషన్‌ని ఎనేబుల్ చేయండి.అవసరమైతేనే జీపీఎస్ లొకేషన్స్ ఆన్ చేయండి. ఆ పని పూర్తికాగానే జీపీఎస్‌ని ఆఫ్ చేయండి. ముఖ్యంగా సామాజిక మాధ్యమాల్లో ఏవైనా అప్‌లోడ్ చేస్తున్నప్పుడు, లైవ్ స్ట్రీమింగ్ చేస్తున్నప్పుడు జీపీఎస్ లొకేషన్ ఆఫ్ చేసి ఉంచండి. end-to-end encrypted మోడ్‌లో ఉన్న మెసేజింగ్ ప్లాట్‌ఫామ్‌లను మాత్రమే వాడండి. పీసీ, ల్యాప్‌టాప్ వెబ్ కెమెరాల్ని ఉపయోగంలో లేనప్పుడు కవర్ చేయండి. అందుకు తగిన స్టిక్కర్లు మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి.మీరు సైబర్ స్టాకింగ్‌కి గురయితే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయండి. స్టాకర్స్ పంపిన మెసేజ్‌లు స్క్రిన్ షాట్స్ తీసి పెట్టుకోండి. అవి ఆధారాలుగా ఉపయోగపడతాయి. cybercrime.gov.in లోకి వెళ్లి ఫిర్యాదు చేయొచ్చు. లేదా 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కి కాల్ చేయొచ్చు.బ్లాక్ చేసేందుకు మార్గాలుసోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్ అందించే సెక్యూరిటీ పాలసీపై అవగాహన ఉండాలి.ఏదైనా ఇబ్బంది ఎదురైనప్పుడు ఆయా సామాజిక మాధ్యమాల్లోని టూల్స్ సాయంతో వెంటనేరిపోర్ట్ చేయొచ్చు. అందుకు ఈ లింక్‌లను చూడండి.



## పదేళ్లలో రూ.12 లక్షల కోట్ల రుణాలు మాఫీ

### సగం పిఎస్‌యుల్లోనే రద్దు

న్యూఢిల్లీ : రెక్కాడితే కానీ డొక్కాడని పేదలు, చాలీచాలని జీతాలతో బతుకు బండిని లాగుతున్న మధ్యతరగతి జీవులు చెల్లించాల్సిన రుణ బకాయిలను బ్యాంకులు ముక్కు పిండి మరీ వసూలు చేస్తాయి. నోటీసులు జారీ చేస్తూ వారిని భయపెడుతుంటాయి. అప్పు తీర్చడం ఆలస్యమైతే తట్టా బుట్టా బయట పడేసి ఇంటి నుండి గెంటేస్తాయి. ఆస్తులు జప్తు చేసి నిలువ నీడ లేకుండా చేస్తాయి. అదే బడా బాబులైతే%ొూ%చూసీ చూడనట్లు వ్యవహరిస్తాయి. వందల కోట్ల అప్పులు ఎగవేసి దేశం వదిలి పారిపోతున్నా ఏమీ ఎరగనట్లే మిన్నకుండి పోతాయి. చివరికి వాటిని రానిబాకీల పద్దులో వేసి, రుణాలు మాఫీ చేసి చేతులు దులుపుకుంటాయి. 2014-15, 2023-24 ఆర్థిక సంవత్సరాల మధ్య కాలంలో%ొూ%అంటే గత పది సంవత్సరాలలో దేశంలోని వాణిజ్య బ్యాంకులు మాఫీ చేసిన రుణాల విలువ అక్షరాలా రూ.12.3 లక్షల కోట్లు. వీటిలో 53 శాతం (రూ.6.5 లక్షల కోట్లు) రుణాలను గత ఐదు సంవత్సరాల కాలంలోనే (2019-20, 2023-24 మధ్య) ప్రభుత్వ రంగ బ్యాంకులు మాఫీ చేశాయి. పార్లమెంటులో సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానంగా ప్రభుత్వం ఈ వివరాలు అందజేసింది. 2018-19 ఆర్థిక సంవత్సరంలో బ్యాంకింగ్ రంగం మాఫీ చేసిన రుణాలు గరిష్ట స్థాయి అంటే రూ.2.4 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. 2015లో ఆస్తుల నాణ్యతా సమీక్ష ప్రారంభమైన తర్వాత ఈ స్థాయిలో రుణాలు రద్దు కావడం ఆ సంవత్సరమే జరిగింది. 2023-24లో అత్యల్పంగా రూ.1.7 లక్షల కోట్ల రుణాలను బ్యాంకులు మాఫీ చేశాయి. ఆ సమయంలో బ్యాంకులకు రావాల్సిన రుణ బకాయిల మొత్తం రూ.165 లక్షల కోట్లు. అందులో కేవలం ఒక శాతం మాత్రమే రద్దయింది. బ్యాంకింగ్ రంగ ఇంక్రిమెంటల్ రుణంలో ప్రభుత్వ బ్యాంకులు ప్రస్తుతం 51 శాతం వాటాను కలిగి ఉన్నాయి. 2022-23లో ఈ వాటా 54 శాతంగా ఉంది. 2020-2024 మధ్యకాలంలో అత్యధిక రుణాలు మాఫీ చేసిన బ్యాంకుల్లో ఎస్‌బిఐ మొదటి స్థానంలో ఉంది. ఆ దిగ్గజ బ్యాంక్ రూ.1,46,652 కోట్ల రుణాలను రద్దు చేయగా.. చేస్తే పంజాబ్ నేషనల్ బ్యాంక్ రూ.82,449 కోట్లు, యూనియన్ బ్యాంక్ రూ.82,323 కోట్లు, బ్యాంక్ ఆఫ్ బరోడా రూ.77,177 కోట్లు, బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ.45,467 కోట్ల రుణాల మాఫీతో తర్వాతి స్థానాలలో నిలిచాయి. ఈ సంవత్సరం సెప్టెంబర్ 30వ తేదీ నాటికి ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకుల స్థూల పారు బకాయిలు వరుసగా రూ.3,16,331 కోట్లు, రూ.1,34,339 కోట్లుగా ఉన్నట్లు రిజర్వ్‌బ్యాంక్ తెలిపిందని ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి చెప్పారు. ఇది మొత్తం పారు బకాయిలలో వరసగా 3.01 శాతం, 1.86 శాతంగా ఉన్నదని వివరించారు. దేశంలోని బ్యాంకింగ్ కార్యకలాపాలలో ఎస్‌బిఐ ఐదో వంతు స్థానాన్ని ఆక్రమించింది. ఈ బ్యాంక్ గత పది సంవత్సరాల కాలంలో రెండు లక్షల కోట్ల రూపాయల రుణాలను రద్దు చేసింది. జాతీయ బ్యాంకుల్లో పంజాబ్ నేషనల్ బ్యాంక్ రూ.94,702 కోట్ల రుణాలు మాఫీ చేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సెప్టెంబర్ వరకూ ప్రభుత్వ రంగ బ్యాంకులు రూ.42,000 కోట్ల రుణాలు రద్దు చేశాయి. గత ఐదు సంవత్సరాల కాలంలో ఇది రూ.6.5 లక్షల కోట్లుగా నమోదైంది. రుణాలు రద్దు చేసినంత మాత్రాన బకాయిదారులు బాధ్యతల నుండి తప్పించుకోలేరని, ఈ నిర్ణయం వారికేమీ ప్రయోజనం కలిగించబోదని, ఆయా ఖాతాదారులపై ఇప్పటికే ప్రారంభించిన చర్యలు కొనసాగుతాయని మంత్రి చౌదరి తెలిపారు. బకాయిల వసూలు కోసం సివిల్ కోర్టులు లేదా రుణ రికవరీ ట్రిబ్యునల్స్‌లో దావా వేస్తామని, చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని, నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్‌లో కేసులు పెడతామని, ఆస్తులను విక్రయిస్తామని తెలిపారు.

**తగ్గిన మొండి బాకీలు..**


దేశంలోని ప్రభుత్వ రంగ బ్యాంకులు 2023-24లో అత్యధికంగా సగటున రూ.1.41 లక్షల కోట్ల నికర లాభాలు ఆర్జించాయని ప్రభుత్వం విడిగా ఓ ప్రకటన చేస్తూ తెలిపింది. ఆస్తుల నాణ్యత మెరుగుపడిందని, సెప్టెంబరులో స్థూల రానిబాకీల 3.12 శాతానికి పడిపోయిందని వివరించింది. 2024-25 తొలి అర్ధ భాగంలో ప్రభుత్వ రంగ బ్యాంకులు రూ.85,520 కోట్ల నికర లాభాన్ని ఆర్జించాయి.

## అంబుజాలోకి సంఘీ, పెన్నా

న్యూఢిల్లీ : అదానీ గ్రూప్‌నకు చెందిన అంబుజా సిమెంట్స్‌లో సంఘీ ఇండస్ట్రీస్, పెన్నా సిమెంట్ విలీనం కానున్నాయి. గత ఏడాది డిసెంబర్‌లో సంఘీ, ఈ ఏడాది ఆగస్టులో పెన్నాలను గౌతమ్ అదానీ నేతృత్వంలోని అదానీ గ్రూప్ సొంతం చేసుకొన్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే సిమెంట్ తయారీ కార్యకలాపాలను ఒక్కచోటికి చేర్చాలని గ్రూప్ భావిస్తున్నది. ఇందులో భాగంగానే ఈ మూడు సిమెంట్ తయారీ సంస్థలను కలిపేయాలన్న నిర్ణయానికి వచ్చింది. షేర్‌హోల్డర్లు, రెగ్యులేటర్ల అనుమతుల దృష్ట్యా 9 నుంచి 12 నెలల్లో ఈ విలీన ప్రక్రియ పూర్తికాగలదన్న ఆశాభావాన్ని అదానీ వర్గాలు వ్యక్తం చేస్తున్నాయి.

**విలీనం ఇలా..**

ప్రస్తుతం అంబుజా సిమెంట్స్‌కు సౌరాష్ట్ర కేంద్రంగా నడుస్తున్న సంఘీ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఎస్ఐఎల్), ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పెన్నా సిమెంట్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (పీసీఐఎల్)లు అనుబంధ సంస్థలుగా ఉన్నాయి. దీంతో వీటిని తమలో విలీనం చేసుకునేందుకు వేర్వేరు పథకాలను ప్రకటించనున్నామని అంబుజా వర్గాలు చెప్తున్నాయి. తాజాగా జరిగిన సమావేశంలో అంబుజా సిమెంట్ బోర్డు కూడా ఈ స్కీములకు ఆమోదం తెలిపింది. కాగా, సంఘీ పెయిడ్-అప్ ఈక్విటీ షేర్ క్యాపిటల్‌లో అంబుజాకు 58.08 శాతం వాటా ఉన్నది. దీని ప్రకారం అర్హులైన సంఘీ షేర్‌హోల్డర్లకు రూ.10 ముఖ విలువ కలిగిన ప్రతీ 100 ఎస్ఐఎల్ ఈక్విటీ షేర్లకుగాను.. రూ.2 ముఖ విలువ కలిగిన 12 ఈక్విటీ షేర్లను అంబుజా జారీ చేయనున్నది. అలాగే పెన్నా ఈక్విటీ షేర్‌హోల్డర్లకు రూ.10 ముఖ విలువ కలిగిన ప్రతీ ఫుల్లీ పెయిడ్-అప్ ఈక్విటీ షేర్‌కు రూ.321.50 చొప్పున అంబుజా చెల్లించనున్నది. సంఘీ, పెన్నాల విలీనంతో ఆదిత్యా బిర్లా గ్రూప్‌నకు చెందిన అల్ట్రాటెక్ సిమెంట్‌కు మార్కెట్‌లో ఉత్పత్తి, అమ్మకాలు, కార్యకలాపాల దృష్ట్యా గట్టి పోటీని ఇవ్వడానికి వీలవుతుందని కూడా అదానీ గ్రూప్ యోచిస్తున్నది. కాగా, 2022 సెప్టెంబర్‌లో అదానీ గ్రూప్ దాదాపు రూ.51,000 కోట్లతో అంబుజా సిమెంట్స్‌ను కొన్న సంగతి విదితమే. ఇక ఏసీసీ లిమిటెడ్‌లో అంబుజా సిమెంట్స్‌కు 51 శాతం వాటా ఉన్నది. రూ.31,000 కోట్లతో మరో 26 శాతం అదనపు వాటానూ కొనేందుకు సిద్ధమయ్యారు.






## మార్కెట్లకు ఫెడ్ గుబులు

### అమ్మకాల ఒత్తిడిలో మదుపరులు
### 81వేల దిగువకు సెన్సెక్స్
### 1,064 పాయింట్లు డౌన్
### 332 పాయింట్లు కోల్పోయిన నిఫ్టీ


ముంబై : దేశీయ స్టాక్ మార్కెట్లు మళ్లీ వరుస నష్టాల్లోకి జారుకున్నాయి. అమెరికా ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ ద్రవ్యసమీక్ష నేపథ్యంలో మదుపరులు ఆచితూచి స్పందిస్తున్నారు. అయితే మెజారిటీ ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణ వైపే మొగ్గు చూపుతున్నారు. దీంతో మంగళవారం సూచీలకు భారీ నష్టాలు తప్పలేదు. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 1,064.12 పాయింట్లు లేదా 1.30 శాతం క్షీణించి 81వేల మార్కుకు దిగువన 80,684.45 వద్ద స్థిరపడింది. ఒకానొక దశలోనైతే 1,136.37 పాయింట్లు పతనమైంది. ఇక నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 332.25 పాయింట్లు లేదా 1.35 శాతం పడిపోయి 24,336 వద్ద నిలిచింది. సోమవారం కూడా సెన్సెక్స్ 384.55 పాయింట్లు, నిఫ్టీ 100.05 పాయింట్లు దిగజారిన విషయం తెలిసిందే.

**ఊగిసలాటలో..**

క్రయవిక్రయాల నడుమ మదుపరులు ఊగిసలాటకు లోనయ్యారు. దీని వెనుకున్న కారణాలను విశ్లేషిస్తే.. అమెరికా ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ జపాన్, బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్‌లు ద్రవ్యసమీక్షలు చేసి వడ్డీరేట్లపై నిర్ణయాలను ప్రకటించబోతున్నాయి. దీంతో స్టాక్, బాండ్ మార్కెట్లతోపాటు పెట్టుబడి తీరుతెన్నులు ప్రభావితం కానున్నాయి. గతంలో వడ్డీరేట్లను తగ్గించినప్పటికీ.. ద్రవ్యోల్బణం అదుపే లక్ష్యంగా ఇకపై వడ్డీరేట్లను ఫెడ్ రిజర్వ్ పెంచవచ్చున్న అంచనాలు మదుపరులను భయపెడుతున్నాయి. కాగా, జపాన్, ఇంగ్లాండ్ బ్యాంకులు ఇప్పుడున్న వడ్డీరేట్లనే కొనసాగించే వీలుందంటున్నారు. మరోవైపు భారతీయ క్యాపిటల్ మార్కెట్ల నుంచి విదేశీ సంస్థాగత మదుపరులు అదేపనిగా పెట్టుబడులను వెనక్కి తీసుకుంటుండటం, అంతర్జాతీయంగా మెజారిటీ స్టాక్ మార్కెట్లు నష్టాల్లోనే కదలాడటం కూడా దెబ్బతీసింది. ఉదయం ఆరంభం నుంచే మార్కెట్లు నష్టాల్లో కదలాడాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ వంటి ప్రధాన షేర్లు అమ్మకాల ఒత్తిడికి గురయ్యాయి. టెలికం సూచీ అత్యధికంగా 2.18 శాతం పడిపోయింది.

**5 లక్షల కోట్లు ఆవిరి**

స్టాక్ మార్కెట్ నష్టాలతో ఈ ఒక్కరోజే లక్షల కోట్ల రూపాయల్లో దేశ, విదేశీ మదుపరుల సంపద హరించుకుపోయింది. బీఎస్ఈ నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.4,92,644.06 కోట్లు తగ్గి రూ.4,55, 13,913.24 కోట్లకు క్షీణించింది. రెండు రోజుల్లో సుమారు 6 లక్షల కోట్లు ఆవిరైంది.






## కస్టమర్స్ బీ అలర్ట్ ..
## వాటిని నమ్మొద్దు : ఎస్‌బిఐ పోస్ట్

ఇటీవల ఎస్‌బిఐ నుండి వస్తున్నట్లుగా కస్టమర్లకు ఫేక్ మెసేజ్‌లు, ఫేక్ వీడియోలు వస్తున్నాయి. పెద్దఎత్తున రిటర్నులు.. అంటూ స్టేట్ బ్యాంక్ టాప్ మేనేజ్‌మెంట్ చెబుతున్నట్లు వీడియోలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయి. దీనిపై ప్రభుత్వ రంగ బ్యాంక్ ఎస్‌బీఐ స్పందించింది. ఇవన్నీ కేవలం నకిలీ వీడియోలు అంటూ స్పష్టం చేసింది. ఈమేరకు 'ఎక్స్' వేదికగా ప్రజలను అప్రమత్తం చేస్తూ ఎస్‌బిఐ ఓ పోస్టును విడుదల చేసింది. "బ్యాంక్ మేనేజ్ మెంట్‌కు చెందిన వ్యక్తులంటూ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న డీప్ ఫేక్ వీడియోలు నమ్మొద్దు. ఆ వీడియోలో పేర్కొన్న పథకాలతో బ్యాంక్‌కు గానీ, బ్యాంక్ అధికారులకు గానీ ఎలాంటి సంబంధం లేదు. ఈ వీడియోలో ఫలానా పథకంలో పెట్టుబడి పెట్టండంటూ ప్రజలకు సలహా ఇస్తున్నారు. ఇలాంటి అవాస్తవమైన, అసాధారణ రాబడి ఇచ్చే వాగ్దానాలు ఎస్‌బీఐ చేయదు. ఇలాంటి మోసాల బారిన పడకుండా ప్రజలంతా అప్రమత్తంగా ఉండండి" అంటూ 'ఎక్స్' వేదికగా పోస్ట్ చేసింది.

# తప్పిన ఫాలోఆన్ గండం

బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ(బీజీటీ) సిరీస్‌లో భారత్, ఆస్ట్రేలియా మధ్య గబ్బా ఫైట్ రసవత్తరంగా సాగుతున్నది. వరుణుడి అంతరాయం మధ్య జరుగుతున్న మూడో టెస్టులో ఆధిక్యం చేతులు మారుతూ వస్తున్నది. ఆసీస్ బౌలర్ల ధాటికి సహచర బ్యాటర్లు విఫలమైన వేళ కేఎల్ రాహుల్, జడేజా అర్ధసెంచరీలతో కదంతొక్కారు. ఆసీస్ బౌలింగ్ దాడిని దీటుగా ఎదుర్కొంటూ కీలక ఇన్నింగ్స్ ఆడారు. పోరాడితే పోయేదేమి లేదన్న తరహాలో వీరిద్దరికి తోడు ఆఖర్లో ఆకాశ్‌దీప్, బుమ్రా అడ్డుగోడలా నిలువడంతో ఫాలోఆన్ గండం తప్పింది. కంగారూల సహనానికి పరీక్ష పెడుతూ ఆకాశ్, బుమ్రా బ్యాటింగ్ భారత అభిమానులకు మంచి కిక్కిచ్చింది. స్వల్ప స్కోరుకే పరిమితం చేద్దామనుకున్న ఆసీస్ ఆశలపై నీళ్లు గుమ్మరిస్తూ టీమ్‌ఇండియాను పోటీలోకి తీసుకొచ్చి గబ్బాపై పట్టు నిలుపుకున్నారు.

### రాహుల్, జడేజా అర్ధసెంచరీలు
### రాణించిన ఆకాశ్, బుమ్రా

**భారత్ తొలి ఇన్నింగ్స్ 252/9**



భారత్, ఆస్ట్రేలియా మధ్య మూడో టెస్టు అభిమానులను అలరిస్తున్నది. ఓవైపు వరుణుడు అంతరాయం కల్గిస్తున్నా.. ఇరు జట్లు తమ పోరాటాన్నే నమ్ముకున్నాయి. పరిస్థితులకు అనుగుణంగా స్వింగ్ రాబడుతూ భారత్‌ను ఆలౌట్ చేద్దామనుకున్న ఆసీస్ ఆశలు నెరవేరలేదు. ఓవర్‌నైట్ స్కోరు 51/4తో నాలుగో రోజు తొలి ఇన్నింగ్స్‌కు దిగిన టీమ్‌ఇండియా 9 వికెట్లకు 252 పరుగులు చేసింది. ఓపెనర్ కేఎల్ రాహుల్(139 బంతుల్లో 84, 8ఫోర్లు), జడేజా(123 బంతుల్లో 77,7ఫోర్లు, సిక్స్) అర్ధసెంచరీలతో విజృంభించారు. ప్రధాన బ్యాటర్లు సింగిల్ డిజిట్ స్కోర్లకే పరిమితమైన వేళ ఈ ఇద్దరు అద్భుత పోరాట పటిమ కనబరిచారు. ఓవైపు వికెట్లు పడుతున్నా..వెరవకుండా విలువైన భాగస్వామ్యాలు నెలకొల్పారు. చివర్లో ఆకాశ్ దీప్‌సింగ్(31 బంతుల్లో 27 నాటౌట్, 2ఫోర్లు, సిక్స్), బుమ్రా(27 బంతుల్లో 10 నాటౌట్, సిక్స్) ఆసీస్ బౌలర్లను విసిగెత్తించారు. ఓవైపు హాజిల్‌వుడ్ గాయంతో మ్యాచ్ మధ్యలోనే వెనుదిరుగగా, ఆ భారాన్ని కమిన్స్ (4/54), స్టార్క్(3/83), లియాన్(1/54) మోశారు. ఇప్పటికే ఫాలోఆన్ గండం నుంచి బయటపడ్డ టీమ్‌ఇండియా..193 పరుగుల వెనుకంజలో కొనసాగుతున్నది. బుధవారం ఆటకు ఆఖరి రోజు. ఏదైనా అద్భుతం జరిగితే తప్పా..ఫలితం వచ్చే అవకాశం లేదు.

**రాహుల్, జడేజా రాణించగా:**

తామేంత విలువైన ప్లేయర్లమో కేఎల్ రాహుల్, జడేజా మరోమారు నిరూపించుకున్నారు. ఓపెనర్‌గా వచ్చిన రాహుల్ మంచి పరిణతి కనబర్చగా, జడేజా..ఆఖరి వరుస ప్లేయర్లతో కలిసి బ్యాటింగ్ కొనసాగించాడు. నాలుగో రోజు కమిన్స్ వేసిన ఇన్నింగ్స్ తొలి ఓవర్ మొదటి బంతికే రాహుల్ 33 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద ఇచ్చిన క్యాచ్‌ను స్లిప్‌లో స్మిత్ వదిలిపెట్టాడు. దీంతో



ఊపిరి పీల్చుకున్న రాహుల్..మరోమారు అలాంటి అవకాశమివ్వలేదు. పిచ్‌పై స్వింగ్‌ను అంచనా వేస్తూ మంచి బంతులను గౌరవిస్తూ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. ఏ బంతిని షాట్ ఆడాలో, ఏ బంతిని విడిచిపెట్టాలో కచ్చితంగా అంచనా వేస్తూ రాహుల్ బ్యాటింగ్ చేశాడు. మరో ఎండ్‌లో తన ఫామ్ లేమిని కొనసాగిస్తూ కెప్టెన్ రోహిత్(10) కమిన్స్‌కు వికెట్ ఇచ్చుకున్నాడు. ఈ తరుణంలో క్రీజులోకొచ్చిన జడేజాతో రాహుల్ జతకలిశాడు. వీరిద్దరు కంగారూ బౌలింగ్ దాడిని తిప్పికొడుతూ కీలక పరుగులు జోడించారు. లియాన్ బౌలింగ్‌లో స్లిప్‌లో స్మిత్ క్యాచ్‌తో రాహుల్ ఔట్ కావడంతో ఆరో వికెట్‌కు 67 పరుగుల భాగస్వామ్యానికి బ్రేక్ పడింది. ఆ తర్వాత ఇన్నింగ్స్ బాధ్యతను జడేజా భుజానేసుకున్నాడు. నితీశ్(16)తో కలిసి అర్ధసెంచరీతో మార్క్ అందుకున్నాడు. అయితే నితీశ్, జడేజాను కమిన్స్ ఔట్ చేయగా, సిరాజ్(1)ను స్టార్క్ బుట్టలో వేసుకున్నాడు. ఇక్కడి నుంచి ఆకాశ్‌దీప్, బుమ్రా పట్టువదలకుండా పోరాడారు. ముఖ్యంగా ఆకాశ్‌దీప్ ఆత్మవిశ్వాసంతో పరుగులు కొల్లగొట్టాడు. ఫాలోఆన్ మార్క్ దాటగానే టీమ్‌ఇండియా డగౌట్‌లో ప్లేయర్లు సంబురాలు చేసుకున్నారు. వీరిద్దరు 10 వికెట్‌కు 39 పరుగుల అజేయ భాగస్వామ్యంతో కొనసాగుతున్నారు.

**సంక్షిప్త స్కోర్లు**

**ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: 445 ఆలౌట్**

**భారత్ తొలి ఇన్నింగ్స్: 252/9(రాహుల్ 84, జడేజా 77, కమిన్స్ 4/80, స్టార్క్ 3/83)**



## వెస్టిండీస్‌తో రెండో టీ-20 మ్యాచ్‌లో టీమిండియాకు ఓటమి..!

వెస్టిండీస్‌తో జరిగిన రెండో టీ-20 మ్యాచ్‌లో టీమిండియా మహిళా జట్టు తొమ్మిది వికెట్ల తేడాతో ఓటమి పాలైంది. ఫలితంగా మూడు టీ-20 మ్యాచ్ ల సిరీస్ 1-1 పాయింట్లతో సమమైంది. తొలుత బ్యాటింగ్ చేసిన టీమిండియా నిర్ణీత 20 ఓవర్లలో తొమ్మిది వికెట్లు కోల్పోయి 159 పరుగులు చేసింది. 160 పరుగుల విజయ లక్ష్యాన్ని వెస్టిండీస్ 15.4 ఓవర్లలో ఒకే ఒక వికెట్ కోల్పోయి సునాయాసంగా చేధించింది. వెస్టిండీస్ ఓపెనర్ హేలీ మాథ్యూస్ 47 బంతుల్లో 17 ఫోర్లతో 85 పరుగులు, క్వినా జోసెఫ్ 22 బంతుల్లో ఆరు ఫోర్లు, రెండు సిక్సర్లతో 38 పరుగులు చేశారు. హేలీ మాథ్యూస్, క్వినా జోసెఫ్ లతో కూడిన ఓపెనర్ల జోడీ తొలి వికెట్ భాగస్వామ్యానికి 66 పరుగులు జోడించారు. క్వినా జోసెఫ్ ఔటైన తర్వాత షెమైన్ 26 బంతుల్లో నాలుగు ఫోర్లతో 29 పరుగులు చేసింది. దీంతో హేలీ మాథ్యూస్ సారథ్యంలోని వెస్టిండీస్ జట్టుకు భారీ విజయం లభించింది. ఈ సిరీస్ లో నిర్ణయాత్మక మూడో టీ-20 మ్యాచ్ గురువారం జరుగుతుంది. ఇక టాస్ ఓడిపోయిన టీం ఇండియా తొలుత బ్యాటింగ్‌కు దిగింది. నిర్ణీత 20 ఓవర్లలో తొమ్మిది వికెట్లు కోల్పోయి 159 పరుగులు చేసింది. స్మృతి మందాన 41 బంతుల్లో ఒక సిక్సర్, తొమ్మిది ఫోర్లతో 62 పరుగులతో అర్ధ సెంచరీ పూర్తి చేసుకోగా, చివర్లో రిచాఘోస్ 17 బంతుల్లో ఆరు ఫోర్లతో 32 పరుగులు చేశారు. జెమీమా రోడ్రిగ్స్ 13, దీప్తి శర్మ 17 పరుగులు చేశారు.

## రోహిత్ శర్మ ప్లాఫ్ షో..! సోషల్ మీడియాలో రిటైర్మెంట్‌పై చర్చ..!



బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలోనూ భారత కెప్టెన్ రోహిత్ శర్మ పేలవమైన ఫామ్ కొనసాగుతున్నది. గబ్బా వేదికగా ఆస్ట్రేలియాతో జరుగుతున్న మూడో టెస్ట్‌లో నాలుగో ఇన్నింగ్స్‌లో అవుట్ అయ్యాడు. రోహిత్‌ను మరోసారి పాట్ కమిన్స్ అవుట్ చేశాడు. కమిన్స్ వేసిన బంతి రోహిత్ బ్యాట్ ఎడ్జ్‌కి తాకి.. కీపర్ అలెక్స్ కారీ చేతుల్లోకి వెళ్లింది. 27 బంతుల్లో 10 పరుగులు చేసి అవుట్ అయ్యాడు. టీమిండియా అభిమానులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో సోషల్ మీడియా వేదికగా మరోసారి స్పందించారు. ఆస్ట్రేలియా పర్యటనలో పెర్త్ టెస్ట్‌కి రోహిత్ దూరమైన విషయం తెలిసిందే. అడిలైడ్‌లో జరిగిన డే-నైట్ టెస్ట్‌కు అందుబాటులోకి వచ్చాడు.

## థియేటర్స్‌లో దెబ్బేసింది.. కానీ ఓటీటీలో అదరగొడుతుంది..



సూర్య నటించిన కంగువ సినిమా భారీ అంచనాల మధ్య థియేటర్స్ లో విడుదలైంది. కానీ ఈ సినిమా ఆశించిన స్థాయిలో విజయాన్ని సాధించలేకపోయింది. సిరుత్తై శివ దర్శకత్వం వహించిన ఈ సినిమా అభిమానులను నిరాశపరిచింది. ఈ సినిమా విడుదలకు ముందు భారీ హైప్ క్రియేట్ అయ్యింది. టీజర్, ట్రైలర్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. చాలా సినిమాలు థియేటర్స్ లో ఆశించినంతగా ఆకట్టుకోకపోయినా ఓటీటీలో మంచి వ్యూస్ ను సంపాదించుకోవడంతో పాటు నయా రికార్డ్స్ కూడా క్రియేట్ చేస్తున్నాయి. థియేటర్స్ లో దెబ్బేసిన ఓటీటీలో అదరగొట్టిన సినిమాలు చాలానే ఉన్నాయి. ఇప్పుడు ఆ లిస్ట్ లో చేరిపోయింది సూర్య లేటెస్ట్ మూవీ కంగువ.

## రూల్స్ బ్రేక్ చేస్తున్న క్రష్మిక.! ఆయన్ని చూస్తూ పెరిగి ఆయనతోనే సినిమా..



యానిమల్ సినిమాతో నార్త్‌లో సెన్సేషన్ క్రియేట్ చేసిన రష్మిక మందన్న, అక్కడ డిఫరెంట్ మూవీస్ చేస్తున్నారు. సౌత్ నుంచి నార్త్ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన బ్యూటీస్ అక్కడ కమర్షియల్ ఇమేజ్ తెచ్చుకున్న దాఖలాలు ఇంత వరకు లేవు. అంతేకాదు ఈ సినిమాల విషయంలో చాలా ఎగ్జైట్ అవుతున్నారు శ్రీవల్లి. యానిమల్ సినిమాతో నార్త్‌లో సెన్సేషన్ క్రియేట్ చేసిన రష్మిక మందన్న, అక్కడ డిఫరెంట్ మూవీస్ చేస్తున్నారు. భాయ్‌జాన్ సినిమాలు చూస్తూ పెరిగిన ఈ బ్యూటీ, ఇప్పుడు ఆయన సినిమాలో నటించే ఛాన్స్ రావటంతో స్కై హైలో తేలిపోతున్నారు. ఇలా బాలీవుడ్ ప్రాజెక్ట్స్ విషయంలో ఫుల్ హ్యాపీగా ఉన్న రష్మిక, అవకాశం వచ్చిన ప్రతీసారి తన ఎగ్జైట్మెంట్‌ను ఫ్యాన్స్‌తో షేర్ చేసుకుంటున్నారు.

## ఆఫర్స్ కోసం ఎదురుచూస్తున్న దక్ష



కింగ్ నాగార్జున, నాగచైతన్య నటించిన బంగార్రాజు సినిమాలో చిన్న పాత్రతో పాటు స్పెషల్ సాంగ్ లో మెరిసింది ఈ భామ. చివరిగా ఈ చిన్నది మాస్ మహారాజ్ రవితేజ నటించిన రావణాసూరలోనూ అవకాశం అందుకుంది. కానీ ఆ సినిమా కూడా నిరాశపరిచింది. ఇక ఈ అమ్మడు ఇప్పుడు ఆఫర్స్ కోసం ఎదురుచూస్తుంది. హూరా హూరి - చిత్రంతో ఎంట్రీ ఇచ్చింది ముంబై బ్యూటీ దక్షా నగార్కర్. ఆ తర్వాత హుషారు సినిమా సక్సెస్ తో యూత్ లో మంచి క్రేజ్ సొంతం చేసుకుంది. ఆ వెంటనే జాంబీ రెడ్డి సినిమాలో హీరోయిన్ గా చేసి మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఈ సినిమా పై దక్షా నగార్కర్ చాలా హోప్స్ పెట్టుకుంది. కానీ ఆ సినిమా కూడా నిరాశపరిచింది. ఇదిలా ఉంటే దక్షా నగార్కర్ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటుంది. సినిమాలకు గ్యాప్ ఇస్తున్నప్పటికీ సోషల్ మీడియాలో మాత్రం ఎప్పుడు అభిమానులతో టచ్ లోనే ఉంటుంది. నెట్టింట ఈ అమ్మడి అందాలకు కొదవే లేదు.. హాట్ హాట్ ఫొటోలతో కుర్రకారు మతిపోగొడుతోంది ఈ చిన్నది. తాజాగా ఈబ్యూటీ పోస్ట్ చేసిన ఫోటోలు యువతకు నిద్రపట్టనివ్వడం లేదు. దక్షా నగార్కర్ ఈ ఫొటోల్లో చాలా హాట్ గా కనిపించింది. ఈ అందం ఇక్కడిది కాదు దేవలోకం నుంచి దిగివచ్చింది అంటూ కుర్రాళ్ళు కొంటె కామెంట్స్ చేస్తున్నారు. ఇక ఈ అమ్మడు సినిమాల విషయంలో చాలా స్లోగా ఉంది. దక్ష ప్రస్తుతం కొత్త సినిమాలను అనౌన్స్ చేయలేదు. ఆమె సినిమాల కోసం ఫ్యాన్స్ వెయిట్ చేస్తున్నారు.

Edited Printed Published and Owned by SOYINENI MAHESH, RNI Reg no. APTEL/2001/5268 printed at m/s Ganesh Printers Ramantapur Hyderabad, Published at m/s Bavani Publication Trust Plot No C-1/2c idl Uppal hydrabad-500039 Chieff Editor : S.Mahesh, 94946 59622, office : 8309979541, Admn office: 1-7-334 2nd floor Musherabad Hydrabad -500020